




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 28 బుధవారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 253

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# కవిత కొత్త పార్టీ

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలనం నిర్ణయం..
- బీఆర్ఎస్‌లో తారా స్థాయికి చేరుకున్న అంతర్గత పోరు
- కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు రావడంతో బీఆర్ఎస్ పార్టీలో కలకలం..రాజకీయ తుపాను
- రాయభారాలు చేసినా,కవిత ససేమిరా
- పార్టీలో తన స్థానమేంటో తేల్చాలంటూ మొండిపట్టు
- లేదంటే జూన్ 2న కవిత కొత్త పార్టీ ప్రకటన?

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు రావడంతో మొదలైన ఈ పొలిటికల్ సైక్లోన్.. మరింత తీవ్రంగా మారేలా కనిపిస్తోంది.
ఎమ్మెల్సీ కవిత.. తన తండ్రి పార్టీని కాదని కొత్త పార్టీ స్థాపించాలని ఆలోచిస్తున్నారట. ఇదే విషయాన్ని కేసీఆర్ పంపిన దూతలకు కూడా తేల్చి చెప్పారట. అంతేకాదు.. జూన్ 2న కొత్త పార్టీపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని జాగృతి నేతలు బయట ప్రచారం చేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది.
బీఆర్ఎస్ పార్టీలో తనకు ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తితో ఎమ్మెల్సీ కవిత ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆమె ఏ సభ, సమావేశాల్లో పాల్గొన్నా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే విధంగానే కామెంట్స్ చేస్తూ వచ్చారు. తాజాగా బీఆర్ఎస్ వరంగల్ సభ తరువాత పార్టీ తీరుపై కేసీఆర్‌కే నేరుగా లేఖ రాశారు. ఈ లేఖ లీక్ అవడంతో.. తెలంగాణ రాజకీయం షేక్ అయ్యింది. ఆ తరువాత పరిణామాలు కూడా

# కార్యకర్తలే.. టీడీపీకి బలం

- కార్యకర్తల పోరాటం వల్లే పార్టీ అధికారంలోకి వచ్చింది
- ఎత్తిన జెండా దించకుండా కార్యకర్తలు పోరాటం చేశారు
- ఎంతో మంది కార్యకర్తలు సైతం ప్రాణత్యాగాలు చేశారు
- కార్యకర్తల పోరాట స్ఫూర్తి చరిత్రలో నిలిచి పోతుంది
- తెలుగు జాతి అభివృద్ధి కోసమే టీడీపీ పని చేస్తుంది
- కడపలో ప్రారంభమైన మహానాడు..చంద్రబాబు ప్రసంగం

2



**కడప-నవభూమిబ్యూరో:** తొలిసారి దేవుని గడప కడపలో మహానాడు నిర్వహిస్తున్నామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సారి మహానాడు చరిత్ర సృష్టించబోతోందని ఆయన స్పష్టం చేశారు. కడప మహానగరం వేదికగా మంగళవారం మహానాడు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈ సభలో పార్టీ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం 10 అసెంబ్లీ స్థానాలకుగానూ 7 చోట్ల తెలుగుదేశం పార్టీ గెలిచిందన్నారు. ఈసారి మరింత కష్టపడి మొత్తం 10 స్థానాలు గెలవాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. కార్యకర్తల పోరాటం వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎత్తిన జెండా దించకుండా కార్యకర్తలు పోరాటం చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశ్నించే గొంతులను నొక్కారని పేర్కొన్నారు. అంతేకాదు.. అక్రమ కేసులు పెట్టి హింసించారన్నారు. ఇక ప్రశ్నించిన కార్యకర్తలను పొట్టన బెట్టుకున్నారని ఆయన తెలిపారు. పసుపు సింహం చంద్రన్నను దారుణంగా చంపారన్నారు. అలాగే ఎంతో మంది కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారని వివరించారు. కార్యకర్తల పోరాట స్ఫూర్తి చరిత్రలో నిలిచి పోతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. పార్టీ కార్యకర్తల త్యాగాలను వృథా కానివ్వమని ఈ సందర్భంగా ఆయన కేడర్‌కు భరోసా ఇచ్చారు. తన పాదయాత్ర నుంచి లోకేష్ యువగళం వరకు.. కార్యకర్తల్లో అదే స్ఫూర్తి, అదే పోరాట పటిమ ఉందన్నారు. జెండా మోస్తున్న కార్యకర్తలే.. టీడీపీ బలమని ఆయన అభివర్ణించారు. తెలుగు జాతి అభివృద్ధి కోసమే టీడీపీ పని చేస్తుందని స్పష్టం చేశారు. పటేల్ - పట్వారీ వ్యవస్థ రద్దు, బీసీలకు రాజ్యాధికారం తదితర అంశాలు తెలుగుదేశం పార్టీ ద్వారానే సాధ్యమైనాయని వివరించారు. అలాగే రూ.2 కిలో బియ్యం, సబ్సిడీ కరెంట్ కూడా ఈ పార్టీనే తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అన్ని ప్రాంతాలు, వర్గాల అభివృద్ధే తమ పార్టీ లక్ష్యమని ఆయన వెల్లడించారు.

## ఎన్‌కౌంటర్‌లో మరో టాప్ మావోయిస్ట్

# కమాండర్ హతం

- జార్కండ్‌రాష్ట్రం పాలం జిల్లాలో ఎన్‌కౌంటర్: కీలకమైన మావో మృతి
- మరణించిన మావోయిస్టు తులసీ బునియన్‌గా గుర్తింపు
- అతడి తలపై రూ. 5 లక్షల రివార్డు ఉందన్న రేంజి డీఐజీ రమేశ్
- మహమ్మద్‌గంజ్, హైదర్‌నగర్ పోలీస్ స్టేషన్ల మధ్య ఎదురుకాల్పులు



రాంచీ-నవభూమిబ్యూరో

జార్కండ్‌లో పాలం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు పాలం రేంజ్ డీఐజీ వైఎస్ రమేశ్ మంగళవారం రాంచీలో వెల్లడించారు. మరణించిన మావోయిస్టు తులసీ బునియన్‌గా గుర్తించామన్నారు. అతడు టాప్ మావోయిస్టు కమాండర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. అతడి తలపై రూ. 5 లక్షల రివార్డు ఉందని వివరించారు. ఇక గాయపడిన మావోయిస్టు నితీశ్ యాదవ్ తలపై రూ.15 లక్షల రివార్డు ఉందన్నారు.
ఈ ఎన్‌కౌంటర్ సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుందని వివరించారు. మహమ్మద్‌గంజ్, హైదర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మావోయిస్టులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి భద్రతా దళాలకు సమాచారం అందిందన్నారు. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు కూంబింగ్ చేపట్టాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు.. భద్రతా దళాలపైకి కాల్పులు జరిపారన్నారు. దీంతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమై.. ఎదురు కాల్పుల జరిపారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ అనంతరం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.
మరోవైపు.. జర్కండ్‌లోని లాటెహార్ జిల్లాలో సోమవారం ఉదయం ఒక ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని గుర్తు చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మనీష్ యాదవ్ మరణించారని తెలిపారు. అతడి తలపై కూడా రూ. 5 లక్షల రివార్డు ఉందన్నారు. మరోవైపు ఆదివారం రాత్రి దౌనా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు కూబింగ్ నిర్వహించాయని.. ఆ క్రమంలో మావోయిస్టు కుందన్ కేర్వార్‌ను అరెస్ట్ చేసినట్లు డీఐజీ వైఎస్ రమేష్ వివరించారు. అతడి తలపై సైతం రూ. 5 లక్షల రివార్డు ఉందన్నారు.

# రాజీనామాకు సిద్ధమైన లోకేష్

- మహానాడు వేళ సంచలనం..!



**కడప-నవభూమిబ్యూరో:** ఏపీలో కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్న మంత్రి నారా లోకేష్ కడపలో జరుగుతున్న మహానాడులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహానాడులో చర్చించాల్సిన ఆరు కీలక అంశాల అజెండాను హాజరైన టీడీపీ శ్రేణుల ముందుంచారు. అంతే కాదు రాజీనామాకు సిద్ధమంటూ నారా లోకేష్ ఓ కీలక ప్రకటన చేశారు. అయితే ఇది ఎవరిని ఉద్దేశించి, ఎందుకు చేశారో ఓసారి చూసేద్దాం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ మధ్య కాలంలో పలు సంస్థలకు భూముల కేటాయింపులు చేస్తోంది. ఇందులో భాగంగా ఉర్సా అనే సంస్థకు విశాఖలో భూములు కేటాయించింది. 2 వేల ఎకరాల మేర జరిగిన ఈ కేటాయింపులకు నామమాత్రంగా ఎకరాకు 99 పైసలు ఎలా వసూలు చేస్తారంటూ విపక్ష వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని పదే పదే ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ జరుగుతున్న మహానాడులో మరోసారి లోకేష్ స్పందించారు.

## గంటల వ్యవధిలో టీడీపీ ఖాతాలోకి

# రూ.17 కోట్లు

- భారీగా టీడీపీకి విరాళాల వెల్లువ

**కడప-నవభూమిబ్యూరో:** ఏపీలో అధికార కూటమి ఏడాది పాలన పూర్తి చేసుకుంటోంది. కూటమికి నేతృత్వం వహిస్తున్న తెలుగు దేశం పార్టీ రాష్ట్రంలో అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. పార్టీ నిర్మాణం పరంగానే కాకుండా ఆర్థికంగానూ బలపడే ప్రయత్నాలు చేస్తోంది. తద్వారా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తమ అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీనికి ఇవాళ కడపలో ప్రారంభమైన మహానాడు వేదికగా మారుతోంది. తెలుగు తమ్ముళ్లకు పసుపు పండుగ అయిన టీడీపీ మహానాడును వైఎస్ కుటుంబ అడ్డాగా చెప్పుకునే కడప జిల్లాలో నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో వైసీపీ కంచుకోటల్ని కుప్పకూల్చిన ఉత్సాహంతో టీడీపీ శ్రేణులు మహానాడుకు భారీ ఎత్తున తరలివెళ్లాయి. అదే సమయంలో టీడీపీ ఖాతాల్లోకి ఏకంగా రూ.17



# విదేశీ పర్యటనకు కేటీఆర్



- లండన్, యూఎస్ పర్యటనకు బయల్దేరిన కేటీఆర్
- డాలస్‌లో జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబురాలతోపాటు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో హాజరు
- 30న లండన్‌లో ఇండియా వీక్-2025లో కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం
- విదేశీ పర్యటనలో వివిధ దేశాల మేధావులు, రాజకీయ నాయకులు, విద్యార్థులను కలవనున్న కేటీఆర్

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

లండన్, అమెరికా పర్యటనకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బయల్దేరారు. అమెరికాలోని డాలస్‌లో జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబురాలతోపాటు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. అలాగే లండన్‌లో జరిగే పలు కీలక కార్యక్రమాల్లో కూడా పాల్గొననున్నారు. ఈ నెల 30న లండన్‌లో జరిగే ఇండియా వీక్ 2025లో కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు ఆర్ అండ్ డీ సేవలను అందించే పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. కేటీఆర్ తన పర్యటనలో వివిధ దేశాల మేధావులు, రాజకీయ నాయకులు, విద్యార్థులను కలవనున్నారు.

**యూకేలో కార్యక్రమాలు**

ముందుగా యూకేలో పర్యటించే కేటీఆర్, బ్రిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో లండన్‌లో జరగనున్న ఇండియా వీక్ 2025లో ప్రధాన ఉపన్యాసం ఇవ్వనున్నారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు పాల్గొనే ఈ సమావేశంలో 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కేంద్రంగా సాగిన పాలన, ఆలోచనలు అద్భుత ఆవిష్కరణలుగా మారిన విధానంతోపాటు తెలంగాణ విజయ ప్రస్థానాన్ని కేటీఆర్ వివరిస్తారు.
మొబిలిటీ టెక్నాలజీలో తెలంగాణ ఆధారిత

# థియేటర్ల బంద్ కుట్ర నిగ్గు తేల్చాల్సిందే

- థియేటర్ల బంద్ వెనుక ఎవరున్నారో తేల్చాలని డిప్యూటీ సీఎం ఆదేశం
- ఈ పరిస్థితికి కారణమైన వారిలో జనసేన నేతలున్నా వదలొద్దు
- టికెట్ ధరల పెంపు కావాలంటే ఫిలిం ఛాంబర్ ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించాలన్న పవన్




**అమరావతి-నవభూమిబ్యూరో:** సినిమా హాళ్ల బంద్ ప్రకటనలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు మంత్రి కందుల దుర్గేష్ వివరాలు అందజేశారు. ఈ క్రమంలో సినిమా థియేటర్‌లు, సినీపరిశ్రమలో సమస్యలపై పవన్ కళ్యాణ్ మీడియా ప్రకటన విడుదల చేశారు. సినిమా హాళ్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. థియేటర్లలో ఆహార పానీయాల నాణ్యత, ధరలపై నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. తన సినిమా అయినా సరే టికెట్ ధరల పెంపు కావాలంటే ఫిలిం ఛాంబర్ ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని తెలిపారు. సినిమా హాళ్ల బంద్ వెనుక ఉన్న శక్తులేమిటో విచారించాలని ఆదేశించారు. ఈ అవాంఛనీయ పరిస్థితికి కారకుల్లో జనసేన తరఫువాళ్ళు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దని అన్నారు.
రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఆ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కొత్త చిత్రాలు విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు నిమిత్తం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని అన్నారు. త్వరలో విడుదలయ్యే హరిహర వీరమల్లు సినిమాకు కూడా టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలని వెల్లడించారు.

## యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు

# పాక్ సర్కార్‌తో సత్సంబంధాలు

- జ్యోతి మల్హోత్రా ఫోన్లు, ల్యాప్ టాప్‌లో 12టెరా బైట్ల డేటా..
- బిగ్ స్కెచ్.. సంచలన విషయాలు వెలుగులోకి..?
- జ్యోతి సంభాషణలు జరిపిన వారిలో నలుగురు ఐఎస్ఐ ఏజెంట్లు
- పాక్‌తో గూఢచర్యం నెరిపిన 8 మంది అరెస్టు..

2



# పోలీస్ లాఠీచార్జ్ ఘటనలో ఒకరి సస్పెన్షన్



2


**తెనాలి-నవభూమి:** ఖాకీ డ్రస్ ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరిస్తాం.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే.. ఇప్పుడు ఆ పప్పులు ఉడికే రోజులు పోయాయి. అధికారం అండతో ఏం చేసినా చెల్లుతుందనుకున్న తెనాలి పోలీసులకు షాక్ తగిలింది. ఒక కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను నడిరోడ్డుపైకి తీసుకొచ్చి అమానుషంగా లాఠీతో కొట్టిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌అయ్యింది. దీనిపై స్పందించిన పోలీసు శాఖలోని ఉన్నతాధికారులు సదరు పోలీసులపై యాక్షన్ తీసుకున్నట్టు సమాచారం.
గంజాయి మత్తులో జాన్ విక్టర్, రాకేష్, బాబూలాల్ అనే ముగ్గురు వ్యక్తులను.. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చిరంజీవిపై దాడి చేశారని ఆరోపిస్తూ గత నెల 27న పోలీసులు అరెస్ట్ చేశారు. అంతే కాకుండా వారిపై పలు కేసులు, రౌడీషీట్లు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వారిని ఐతానగర్ ప్రాంతానికి తీసుకెళ్లి శారీరకంగా శిక్షించినట్లు తెలుస్తోంది. టూ టౌన్ సీఐ రాములు నాయక్, త్రీ టౌన్ సీఐ

## 100 ఎకరాల్లో తెలంగాణ కొత్త హైకోర్టు.. అమ్మో..,నిర్మాణానికి అన్ని వేల కోట్లా..?



హైదరాబాద్-నవభూమి:తెలంగాణ కొత్త హైకోర్టు నిర్మాణ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం నూతన హైకోర్టు భవన నిర్మాణానికి కేటాయించింది. ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్టును డీఈసీ ఇన్ ఫ్రా సంస్థ దక్కించుకుంది. కాగా, కొత్త హైకోర్టు భవన నిర్మాణానికి రూ.2,583 కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇస్తూ గత ఏడాది డిసెంబరులో లా సెక్రటరీ తిరుపతి జీవో జారీ చేశారు. దీనికి అనుగుణంగా ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా.. ఎన్సీసీతో పాటు డీఈసీ మాత్రమే టెండర్లు దాఖలు చేశాయి. కమిషనర్ ఆఫ్ టెండర్స్‌లో డీఈసీ అర్హత సాధించి ఈ కాంట్రాక్టును పొందింది.సివిల్ పనుల కోసం రూ.1,980 కోట్లు, ఫర్నిచర్‌తో పాటు ఇతర ఖర్చుల కోసం రూ.603 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. జీఎస్టీ మినహాయించి రూ.1,443 కోట్లకు టెండర్ పిలవగా.. డీఈసీ 4.95 శాతం ఎక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకుందని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు వెల్లడించారు. డీపీఆర్ ఖరారు బాధ్యతలను వన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించగా, ఆ సంస్థ పలు డిజైన్లను సిద్ధం చేసింది. ఈ డిజైన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని జడ్జిల కమిటీ ముందు కన్సల్టెన్సీ, ఆర్అండ్‌బీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా.. కమిటీ ఒక డిజైన్‌ను ఖరారు చేసింది.కొత్త హైకోర్టు భవన సముదాయంలో ప్రధాన కోర్టు భవనం ఆరు అంతస్తుల్లో 8.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ప్రధాన న్యాయమూర్తి బంగ్లా, జడ్జిల క్వార్టర్లు, స్టాఫ్ కోసం నివాసాలు, అడ్మిన్ బ్లాకులు, రికార్డుల భద్రతకు ప్రత్యేక బ్లాకులు, బార్ కౌన్సిల్ బిల్డింగ్, అడ్వకేట్లకు లైబ్రరీ, 42,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆడిటోరియం వంటివి ఉంటాయి. సుమారు 3 వేల బైకుల పార్కింగ్, 1500 కార్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు.

## నవ వార్త



## ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. 44 స్పెషల్ ట్రైన్స్ ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే



హైదరాబాద్-నవభూమి: ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాలకు వీక్లీ స్పెషల్ రైళ్లను నడిపించనున్నట్లు తెలిపింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 44 ప్రత్యేక రైళ్లను పట్టాలెక్కించినట్లు వివరించింది. విశాఖపట్నం %-% బెంగళూరు (08581) మధ్య జూన్ ఒకటి నుంచి 29వ తేదీ వరకు ప్రతి ఆదివారం రైలు రాకపోకలు సాగిస్తుందని పేర్కొంది. ఇక బెంగళూరు-విశాఖపట్నం (08582) మధ్య జూన్ 2 నుంచి 30 వరకు ప్రతి సోమవారం రైలు నడుస్తుందని తెలిపింది.విశాఖపట్నం తిరుపతి (08547) రైలు జూన్ 4 నుంచి జులై 30 వరకు ప్రతి బుధవారం రైలు నడుస్తుందని.. విశాఖపట్నం-తిరుపతి (08548) రైలు జూన్ 5 నుంచి జులై 31 వరకు ప్రతి గురువారం రైలు నడుస్తుందని తెలిపింది. విశాఖపట్నం-చర్లపల్లి (08579) రైలు జూన్ 6 నుంచి జులై 27 వరకు ప్రతి శుక్రవారం.. చర్లపల్లి నుంచి %-% విశాఖపట్నం (08580) మధ్య రైలు జూన్ 7 నుంచి జులై 26 వరకు ప్రతి శనివారం నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే వివరించింది. ప్రయాణికులు ఆయా రైళ్ల సేవలను వినియోగించుకోవాలని కోరింది.

## మూడురోజులు భారీ నుంచి అతిభారీ వానలు..

### ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్..!



హైదరాబాద్- నవభూమి: తెలంగా ణలో రాగల మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని.. ప్రస్తుతం మహబూబ్‌నగర్, కావలి వరకు విస్తరించాయని.. తెలంగాణ, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఒడిశా తీరం వెంబడి వాయువ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి దక్షిణం వైపునకు వంగి ఉందని పేర్కొంది.నెమ్మదిగా ఉత్తరం వైపునకు కదిలే అవకాశాలున్నాయని.. రాబోయే 48గంటల్లో మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. తూర్పు విదర్భపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని.. ఇప్పుడు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొంది. ఈ క్రమంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీల వరకు తక్కువగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. నాలుగు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ కేంద్రం.

## నిరుద్యోగులకు శుభవార్త తెలిపిన మంత్రి సీతక్క



హైదరాబాద్-నవభూమి: తెలంగాణలోని నిరుద్యోగులకు మంత్రి సీతక్క శుభవార్త తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడించారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు ప్రకటించారు.నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరో వైపు స్వయం ఉపాది అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు యునిట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు.

## యువతితో డేటింగ్.. అనంతరం ఏం జరిగిందంటే..

హైదరాబాద్-నవభూమి:ఎల్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. అమీర్‌పేట్‌కు చెందిన యువతి బెంగుళూరులోని ఓ కామన్ ఫ్రెండ్స్ మీటింగ్‌లో శశాంక్ వేలూరితో పరిచయం అయింది. తొలిచూపులోనే పెళ్లి చేసుకుంటానని ప్రపోజ్ చేశాడు. దీంతో ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి డేటింగ్ కూడా చేశారు. ఉన్నత చదువుల కోసం యూకే వెళుతున్నానని, కొన్నాళ్ల తర్వాత వచ్చి పెళ్లి చేసుకుని నిన్ను కూడా యూకే తీసుకువెళతానని యువతికి చెప్పి శశాంక్ యూకే వెళ్లిపోయాడు.యూకే వెళ్ళిన తర్వాత శశాంక్ యువతి సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేసి.. ఆమెను దూరం పెట్టాడు. యువతి ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో 2023 డిసెంబర్‌లో ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# హైదరాబాద్‌లో అద్దె ఇంటి కోసం వెతుకుతున్నారా..?



హైదరాబాద్-నవభూమి: ఈజీ మనీకి అలవాటుపడిన కొందరు మోసాల బాట పడుతున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో అద్దె ఇండ్ల పేరుతో మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. అద్దె ఇంటి కోసం వెతికే వారిని టార్గెట్ చేసుకొని ఈజీగా బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా.. మరో మోసం వెలుగులోకి వచ్చింది. నగరంలో అద్దె ఇళ్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఓ వ్యక్తి రెడిట్ పోస్ట్‌లో వెల్లడించాడు. అనుమానాస్పదంగా కనిపించే అద్దె ప్రకటనలు, వాటి వెనుక జరుగుతున్న మోసపూరిత వ్యవహారాలను ఈ పోస్ట్ వెలుగులోకి తెచ్చింది.ఓ వ్యక్తి తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకుంటూ.. తాను చూసిన ఓ అద్దె ఇంటి ప్రకటనలో అద్దె చాలా తక్కువగా ఉందని తెలిపారు. ఆ నంబర్‌కు కాల్ చేయగా.. వారు ఓనర్ నంబర్ ఇచ్చి ఆయన్ను సంప్రదించమని సూచించారు. ఓనర్, అపార్ట్‌మెంట్‌ను చూడటానికి ముందుగా రూ.1,500 రిఫండబుల్ అని చెప్పి ఎంట్రీ ఛార్జ్‌గా డిమాండ్ చేశారు. రూ.1500 పే చేసిన తర్వాత ఓనర్ అని చెప్పుకున్న వ్యక్తి పత్తా లేకుండా పోయాడని తెలిపాడు. ఇది చాలా దారుణం అని.. ఇలాంటి మోసాలు ఉంటాయని తాను ఊహించలేదని పోస్టులో రాసుకొచ్చాడు.ఈ పోస్ట్‌కు అనేక మంది యూజర్లు స్పందించారు. ‘నా స్నేహితుడు కూడా ఇలాగే మోసపోయాడు. అది స్కామ్ అని తర్వాత తెలిసింది.’ అని ఒకరు రిప్లయ్ ఇచ్చాడు. మరో యూజర్ లాన్కో హిల్స్‌లో 1 బీహెచ్‌కే ఫ్లాట్‌కు సంబంధించిన నకిలీ ప్రకటనతో తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. ‘వారు రూ. 2,000 అడిగారు. అదృష్టవశాత్తూ, నా మేనేజర్ అక్కడే నివసిస్తున్నారు, లాన్కో హిల్స్‌లో 1 బీహెచ్‌కే ఫ్లాట్‌లు అసలు ఉండవని, ఎంట్రీ ఫీజు వసూలు చేయరని నాకు చెప్పారు. ఇదే విషయాన్ని ఆ స్కామర్‌కు చెప్పాను. వెంటనే అతని ధోరణి మారిపోయింది. దాంతో ఆ కథ అక్కడితో ముగిసిపోయింది.’ అని రాసుకొచ్చాడు.అద్దె ఇళ్ల కోసం చూసేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

మార్కెట్ ధర కంటే చాలా తక్కువ అద్దెకు ప్రకటనలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి.


ఇంటిని చూడటానికి ముందుగా ‘ఎంట్రీ ఫీజు’ లేదా ‘రిఫండబుల్ డిపాజిట్’ పేరుతో డబ్బు అడిగితే మోసం కావచ్చని గుర్తించాలి.

అద్దెకు తీసుకునే ముందు ఇంటి యజమాని, అపార్ట్‌మెంట్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. వీలైతే, స్థానికులతో మాట్లాడటం, గేటెడ్ కమ్యూనిటీల విషయంలో మేనేజ్‌మెంట్‌ను సంప్రదించడం మంచిది.

సోషల్ మీడియా, కొన్ని వెబ్‌సైట్‌లలో వచ్చే నకిలీ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీలలో 1 బీహెచ్‌కే ఫ్లాట్‌లు అరుదుగా ఉంటాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

# కరోనా కొత్త వేరియంట్



హైదరాబాద్-నవభూమి:ఆరేళ్ల క్రితం చైనాలో వెలుగు చూసిన ఈ వైరస్.. ప్రపంచం మొత్తాన్ని భయపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కోవిడ్ ప్రభావానికి గురి కాగా.. అధికారిక లెక్కల ప్రకారమే 70 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. కరోనా ప్రభావం నుంచి, అది మిగిల్చిన నష్టాల నుంచి మానవాళి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే మరోసారి కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మన దేశంలో కూడా కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా 1000కి పైగా యాక్టివ్ కేసులున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీల్లో కొత్త కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయని తెలిపింది.

ఇక ఇండియాలో రెండు కరోనా కొత్త వేరియంట్లు గుర్తించారు. మరి ఇప్పుడు నమోదవుతున్న కోవిడ్ వేరియంట్ లక్షణాలు ఎలా ఉంటున్నాయి అనే దానిపై సింగర్ స్మిత తల్లి, వి జోగులాంబ స్పందిస్తూ.. తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. కోవిడ్ వేరియంట్ లక్షణాలు ఎలా ఉంటాయో తెలుపుతూ పోస్ట్ చేశారు. ఆ వివరాలు...జోగులాంగ తన ఎక్స్ ఖాతాలో.. ప్రస్తుతం వ్యాపిస్తున్న కోవిడ్ వేరియంట్ లక్షణాల గురించి వివరించారు.తాను మూడు సార్లు వ్యాక్సిన్ తీసుకున్నా.. కరోనా బారిన పడ్డానని చెప్పుకొచ్చారు. వైరస్ బారిన పడిన తొలి రోజు జ్వరం.. రెండవ రోజు తలనొప్పి, మూడో రోజు గొంతునొప్పి, నాల్గవ రోజు జలుబు, ఐదో రోజున కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న వేరియంట్ రోజుకొక కొత్త లక్షణంతో సకల కళా వల్లభన్‌లా ఉందన్నారు.పైగా ఈ వేరియంట్ వెళ్తూ వెళ్తూ.. విపరీతమైన బలహీనతను మిగిల్చి వెళ్లిందని తెలిపారు. దీని నుంచి బయట పడాలంటే చాలా సమయం పడుతుందన్నారు. అంతేకాక మన దగ్గర కేసులు లేవన్నది భ్రమ అని.. ఎవరూ టెస్టులు చేయించుకోవడం లేదని తెలిపారు. కనుక ఎవరికి వారు ముందు జాగ్రత్తగా మాస్కు ధరించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు రద్దీగా ఉండే ప్రాంతాలకు వెళ్లకపోవడం మేలని సూచించారు.కరోనా కేసులు పెరుగుతున్న తరుణంలో కోవిడ్ వ్యాక్సిన్ సామర్థ్యాన్ని అస్సలు తోసిపుచ్చలేమని చెప్పుకొచ్చారు. కరోనా వ్యాక్సిన్ మన శరీరంలో కాబట్టే.. కోవిడ్ ఊపిరితిత్తుల దాకా వెళ్ళడం లేదన్నారు. వ్యాక్సిన్ లేక గతంలో కోవిడ్ ఊపిరితిత్తుల వరకు వ్యాపించి.. ఎంత ఇబ్బంది

## పోలీస్ లాఠీఛార్జ్ ఘటనలో ఒకరి సస్పెన్షన్

(1వపేజీ తరువాయి)ఎస్ రమేష్ బాబు నడిరోడ్డు మీద వారిని అరికాళ్లపై లాఠీలతో అమానుషంగా కొట్టిన వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది.అయితే వారిలో ఒకరు దెబ్బలకు తాళలేక కాళ్లు ముడుచుకోగా.. సీఐ రాముల నాయక్ బూటు కాళ్లతో తొక్కి పట్టుకున్నారు. నిందితుల్లో ఇరువురు ఎస్సీ సామాజిక సామాజిక వర్గానికి.. మరొకరు మైనార్ వర్గానికి చెందిన వారుగా గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టు ముందు హాజరు పరిచి శిక్ష అమలయ్యేలా చూడకుండా.. ఈ రకంగా దాడికి దిగడం ఏమిటని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోను వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు సైతం సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ తీవ్రంగా విమర్శించారు.

# పాక్ సర్కార్‌తో సత్సంబంధాలు

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో సంచలన విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఆమెకు పాకిస్థాన్ ప్రభుత్వం, ఐఎస్ఐ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా ఆమెకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ హరియాణాలోని హిసార్ కోర్టు తీర్పును వెలువరించింది. అయితే పోలీసుల విచారణలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా.. పాకిస్థాన్ కు గూఢచారిగా వ్యవహరించి అరెస్టయింది. ఆమె కేసు విచారణలో ఉంది. ఈ మేరకు హరియాణాలోని హిసార్ కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే తాజాగా పోలీసుల విచారణలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జ్యోతి మల్హోత్రా వాడిన గ్యాడ్జెట్స్(ఫోన్, ల్యాప్ టాప్.. తదితర పరికరాలు) లో భారీ స్థాయిలో డేటాను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఆ డేటా మొత్తం సామర్థ్యం 12 టెరా బైట్లు మేర ఉందని తెలుస్తోంది. పోలీసుల విచారణలో భాగంగా జ్యోతి మల్హోత్రా ఫోన్లు, ల్యాప్ టాప్ లను తనిఖీ చేశారు. దీంతో ఈ గ్యాడ్జెట్స్ లో ఏకంగా 12 టెరా బైట్స్ మేర సమాచారం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ సమాచారాన్ని స్కాన్ చేస్తే మొత్తం సమాచారం బయటకు వస్తుందని.. పలు కీలక ఆధారాలు లభ్యం అవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇక జ్యోతి సీక్రెట్‌గా సంభాషణలు జరిపిన వారిలో నలుగురు పాక్ ఐఎస్ఐ ఏజెంట్లు ఉన్నారు. వారిలో పాకిస్తాన్ కంటే మేమే ఘోరమా? మావోల సంచలన లేఖ!” మరోవైపు ఆమె గతంలో పాకిస్థాన్ వెళ్లినప్పుడు అక్కడి ప్రభుత్వం జ్యోతికి గ్రాండ్ వెల్ కమ్ చెప్పినట్లు.. రాచ మర్యాదలు చేసినట్లు తేలింది. ఆరుగురు గన్ మెన్స్ తో ఆమెకు ఫుల్ సెక్యూరిటీ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏకే 47 రైఫిల్స్‌తో జ్యోతి మల్హోత్రాకు భద్రత కల్పించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇక ఇప్పటికే పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీళ్లంతా పాక్ నుంచి డబ్బు తీసుకుని ఇక్కడి రహస్య సమాచారాన్ని.. పోలీసులు, అధికారుల కదలికలను ఎప్పటికప్పుడు పాకిస్థాన్ నిఘా వర్గాలకు చేరవేస్తున్నట్లు గుర్తించారు.

# కార్యకర్తలే.. టీడీపీ బలం

(1వపేజీ తరువాయి)గతంలో విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. పాలన అంటే వేధింపులే అన్నట్లుగా గతంలోని పాలకులు వ్యవహరించారన్నారు. తెలుగుదేశం తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. బీసీలను అధికారంలో భాగస్వాములం చేశామన్నారు. అవినీతి రహిత పాలనను అందిస్తున్నామని చెప్పారు. ఇక ప్రజల ఆస్తులకు రక్షణగా నిలబడ్డామని స్పష్టం చేశారు. జవాబుదారీ వ్యవస్థను దేశానికే పరిచయం చేశామన్నారు. భావితరాల భవిష్యత్ కోసం కార్యక్రమాలు రూపకల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రం ఫస్ట్ అనేదే టీడీపీ నినాదమని ఆయన పేర్కొన్నారు.

కార్యకర్తల కష్టానికి గౌరవం, గుర్తింపు ఇచ్చి సంక్షేమాన్ని అందిస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఎజెండాగా పార్టీ ప్రస్థానం సాగుతోందని తెలిపారు. సంక్షేమం, సంస్కరణలు, అభివృద్ధికి టీడీపీనే ట్రెండ్ సెట్టర్ అని ఆయన స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేశామని చెప్పారు. ఇక 2047 నాటికి జీరో పావర్టీ సాధిస్తామని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ క్రమంలో ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గిస్తామన్నారు. అందరూ ఆరోగ్యం, ఆనందంగా ఉండాలన్నదే తమ విధానమని తెలిపారు.

రాజకీయాల్లో విలువలు పెంచిన ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు. ప్రాంతీయ పార్టీగా పుట్టి.. జాతీయ స్థాయిలో ఎదిగామన్నారు. పార్టీ పనైపోయిందన్న వారి పనే అయిపోయిందన్నారు. ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలను ఎదుర్కొన్నామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నీతి, నిజాయితీకి టీడీపీ బ్రాండ్ అని ఆయన అభివర్ణించారు.

ప్రతి క్షణం ప్రజల కోసమే పనిచేస్తున్నామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. ఒక్కో ఇటుక పేరుస్తూ రాష్ట్రాన్ని నిలబెడుతున్నామన్నారు. 2024లో ఏపీ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చాయని తెలిపారు. కూటమి పాలనతో ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. 2024 ఎన్నికల ఫలితాలతో ప్రజల్లో ఆశలు చిగురించాయని చెప్పారు.

ఇక వెల్త్, హెల్త్, హ్యాపీ సొసైటీ తమ విధానమని ఆయన చెప్పారు. రాష్ట్రంలో నేరస్తులకు చోటు లేదన్నారు. ఎవరు అవినీతి చేసినా మొత్తం కక్కిస్తామని హెచ్చరించారు. తప్పు చేసిన వారికి కాస్త ఆలస్యమైనా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. నేరస్తులు ఎక్కడున్నా వారిని వదిలిపెట్టమని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

వైసీపీ అవినీతి, అక్రమాలపై రాజీ లేని పోరాటం చేశామని ఆయన గుర్తు చేసుకున్నారు. ఎన్నికల్లో మనల్ని గెలిపించి అవినీతిపరులను తరిమేశారని తెలిపారు. అక్రమార్కులను శిక్షించే బాధ్యతను మనకు ప్రజలు అప్పగించారన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ఒక గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ చేపడతామన్నారు. కేంద్రం ఇచ్చే రూ. 6 వేలతో కలిపి 3 విడతల్లో రూ.20 వేలు అందేస్తామని తెలిపారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. దేశంలో పెద్ద నోట్లన్నీ రద్దు చేయాలని కేంద్రానికి ఆయన సూచించారు. డిజిటల్ కరెన్సీ వచ్చాక పెద్ద నోట్ల అవసరం లేదని.. వాటి రద్దుతోనే అవినీతిని అరికట్టగలమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రాజెక్టులు ప్రారంభించి.. పూర్తి చేసిన పార్టీ టీడీపీని గుర్తు చేశారు. 30 ఏళ్ల క్రితమే ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్‌ను రాష్ట్రానికి తీసుకు వచ్చామని వివరించారు. గత ఐదేళ్లలో ఒక్క పైసా కూడా ఇరిగేషన్‌కు ఖర్చు పెట్టలేదని మండిపడ్డారు. ఈ ఏడాదే హంద్రీనీవా పనులు పూర్తి చేసి.. నీళ్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమ రైతులను బలోపేతం చేసేలా.. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో టాటా ఇన్నోవేషన్ హబ్స్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు

## విదేశీ పర్యటనకు కేటీఆర్

(1వపేజీ తరువాయి)ఆవిష్కరణలకు సాక్ష్యంగా నిలిచిన ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను అదే రోజు వార్విక్‌లో కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఈ కేంద్రంలో అత్యాధునిక నీర్ షోర్ హార్డ్‌వేర్-ఇన్-లూప్ టెస్ట్ సెంటర్ ఉంది. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీల కోసం అధునాతన ఆర్ అండ్ డీ సేవలను పీడీఎస్ఎల్ అందిస్తుంది.

**యూఎస్ షెడ్యూల్ ఇలా..**

అమెరికాలో తెలంగాణ ఎన్ఆర్ఐలు నిర్వహించే కీలక కార్యక్రమాలకు కేటీఆర్ హాజరవుతారు. జూన్ 1న టెక్సాస్‌లోని ఫ్రిస్కోలోని కొమెరికా సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వేలాది ఎన్ఆర్ఐలు పాల్గొంటారుయూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్ డాలస్ (యూటీ డాలస్)లోని భారతీయ విద్యార్థులను జూన్ 2 న కేటీఆర్ కలుస్తారు. తన ఉపన్యాసాలు, పనితీరుతో యువతకు స్ఫూర్తిగా నిలిచిన కేటీఆర్, నూతన ఆవిష్కరణలు, ఎంట్రప్రెన్యూర్షిప్‌తోపాటు భవిష్యత్ భారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర గురించి కేటీఆర్ మాట్లాడనున్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూకే, యూఎస్ పర్యటనపై అక్కడి ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రెండు దేశాల్లోని ప్రవాస తెలంగాణ వాసులతో పాటు ప్రవాస భారతీయులు, విద్యార్థులను తన పర్యటనలో కేటీఆర్ కలవబోతున్నారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి కేటీఆర్‌తోపాటు బయల్దేరిన వారిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ఉన్నారు.

## కవిత కొత్త పార్టీ

(1వపేజీ తరువాయి)చాలా హీట్ క్రియేట్ చేశాయి. అమెరికా నుంచి వచ్చిన కవిత.. ఎయిర్‌పోర్టులోనే మీడియాతో మాట్లాడారు. ఆ లేఖ తాను రాసిందేనని కన్ఫామ్ చేసిన ఆమె.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ బాంబ్ పేల్చారు. ఇక కవిత లేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం స్పందించారు. కవితకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు.

**దూతలతో మంతనాలు..**పరిస్థితులు చేయి దాటిపోతుండటంతో కవిత వద్దకు కేసీఆర్ తన దూతలను పంపించారు. కవిత అసంతృప్తికి గల కారణాలపై చర్చించారు. అయితే, వీరి చర్చలు సైతం విఫలమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తనకు బీఆర్ఎస్ పార్టీలో ప్రాధాన్యత లేకుంటే తన దారి తాను చూసకుంటానని కేసీఆర్‌కు కవిత స్పష్టం చేశారట. పార్టీ కూడా పెట్టే ఆలోచనలతో ఉన్నట్లు స్పష్టం చేశారట.

**జూన్ 2న కొత్త పార్టీ..**ఇదిలా ఉంటే.. కవిత బీఆర్ఎస్‌ను వీడి కొత్త పార్టీ పెడతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. ఇక ఆ పార్టీలో ఉండాలనుకోవడం లేదని ఆమె అనుచరులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కవిత వరుసగా పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని అంటున్నరు. ఇప్పటికే జాగృతిని విస్తరిస్తూ పలు కొత్త కమిటీలను కవిత ఏర్పాటు చేశారు. వరుసగా జాగృతి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ కమిటీలను ప్రకటిస్తున్నారు. మంగళవారం నాడు సింగరేణి జాగృతి కమిటీని కవిత ప్రకటించారు. తొమ్మిది మంది కన్వీనర్లను నియమించారు. బహుజన సామాజిక న్యాయం ట్యాగ్ లైన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని కల్వకుంట్ల కవిత భావిస్తున్నట్లు ఆమె అనుచరులు చెబుతున్నారు.

**ప్రతిపక్షాలు సైతం..**కవిత కొత్త పార్టీ పెడతారని.. జూన్ 2వ తేదీన కొత్త పార్టీని ఆమె ప్రకటిస్తారని ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో చీలిక ఖాయం అని, కేటీఆర్ నాయకత్వాన్ని కవిత అంగీకరించడం లేదంటున్నారు. ఈ కారణంగానే ఆమె సొంత పార్టీ పెట్టబోతున్నట్లు ప్రత్యర్థి పార్టీల నేతలు అంటున్నారు.

## రాజీనామాకు సిద్ధమైన లోకేష్

(1వపేజీ తరువాయి)మహానాడులో లోకేష్ 6 శాసనాల ప్రకటన-ఏంటో తెలుసా ?” ఉర్సా సంస్థకు 99 పైసలకు ఎకరా భూమి కేటాయించినట్లు జగన్ నిరూపిస్తే రాజీనామా చేసేందుకు సిద్ధమని నారా లోకేష్ మహానాడు వేదికగా సవాల్ విసిరారు. టీసీఎస్ కు మాత్రమే 99 పైసలకు ఎకరా చొప్పున భూములిచ్చామని, ఉర్సాకు మాత్రం మార్కెట్ రేటుకే భూమి కేటాయించినట్లు లోకేష్ క్లారిటీ ఇచ్చారు. వీటి ద్వారా విశాఖలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించగలిగితే ఇక ఆ నగరాన్ని అందుకోవడం కష్టమే అన్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ఎంతో చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇక పరిశ్రమలు రావడమే కానీ పోవడం ఉండదన్నారు.

### గంటల వ్యవధిలో టీడీపీ ఖాతాలోకి రూ.17 కోట్లు

(1వపేజీ తరువాయి)కోట్లు వచ్చిపడ్డాయి. మహానాడు సందర్భంగా పార్టీకి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ ఎత్తున విరాళాలు సమర్పిస్తున్నారు.ఈ నేపథ్యంలో కడప మహానాడులో టీడీపీకి భారీ విరాళాలు అందుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా మహానాడు వేళ కొన్ని గంటల వ్యవధిలోనే ఇలా రూ.17 కోట్ల విరాళాలు అందినట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇలా విరాళాలు అందించిన వారిలో నేతలు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ విరాళాన్ని పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ఖర్చు చేస్తామని సీఎం చంద్రబాబు మహానాడు వేదికగానే ప్రకటించారు. ఇప్పటికే 45 రోజుల వ్యవధిలోనే కోటి మంది సభ్యత్వాలు నమోదు చేసి రికార్డు సృష్టించిన టీడీపీ వారి సంక్షేమం కోసం 5 లక్షల బీమా సౌకర్యాన్ని కూడా కల్పించింది.

## వైరా మాజీ ఎమ్మెల్యే కన్నుమూత.. ప్రముఖుల సంతాపం



ఖమ్మం,నవభూమి: వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కన్నుమూశారు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే ఈరోజు (మంగళవారం) గుండెపోటు రావడంతో మాజీ ఎమ్మెల్యే తుదిశ్వాస విడిచారు. 2014 సెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు మదన్ లాల్. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇంఛార్జిగా మదన్ లాల్ ఉన్నారు. మదన్ లాల్ మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి , బీఆర్ఎస్ నేతలు సంతాపం తెలియజేశారు.%ఖమ్మం జిల్లా వైరా మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోత్ మదన్ లాల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. మదన్ లాల్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. మదన్ లాల్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.సీఎం రేవంత్ సంతాపం:ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. మదన్ లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
బుధవారం
28 ၊ మే ၊ 2025

## యువతకు ఉద్యోగాలు ఎందుకు లేవు

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ ఎమ్ఎస్ఎమ్ఈ) రంగంపై ఇటీవల రెండు నివేదికలు విడుదలయ్యాయి. ఒకటి 'స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనం కాగా మరొకటి నీతిఆయోగ్ రూపొందించినది. రెండూ అధికారిక నివేదికలే. ఇవేకాక మరొకటి 'యాన్యువల్ సర్వే ఆఫ్ అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సెక్టోర్ ఎంటర్‌ప్రైజెస్' నివేదిక కూడా ఉన్నది. ఎమ్ఎస్ఎమ్ఈల గురించి ఈ రెండు అధికారిక నివేదికలు వెల్లడించిన ప్రాథమిక వాస్తవాలు ఏమిటి? ప్రస్తుత వర్గీకరణ ప్రకారం సూక్ష్మ పరిశ్రమలలో పెట్టుబడుల గరిష్ఠ పరిమితి రూ.2.5 కోట్లు కాగా అవి చేసే మొత్తం వ్యాపారం గరిష్ఠంగా రూ.10 కోట్ల మేరకు ఉంటుందిబీ చిన్న తరహా పరిశ్రమలలో మదుపుల గరిష్ఠ పరిమితి రూ.25 కోట్లు కాగా, వాటి మొత్తం వ్యాపారం గరిష్ఠంగా రూ.100 కోట్లు దాకా ఉంటుందిబీ మధ్యతరహా పరిశ్రమలలో పెట్టుబడుల గరిష్ఠ పరిమితి రూ. 125 కోట్లు కాగా, వాటి గరిష్ఠ వ్యాపారం రూ.500కోట్లు దాకా ఉంటుంది. ఈ వర్గీకరణ ప్రకారం భారతదేశంలో పరిశ్రమలు అత్యధికం ఎమ్ఎస్ఎమ్ఈలేనని స్పష్టమవుతుంది. ఎమ్ఎస్ఎమ్ఈలలో సూక్ష్మ పరిశ్రమలే అత్యధికంగా ఉన్నాయి. మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో సూక్ష్మ పరిశ్రమలు 98.64 శాతం కాగా, చిన్నతరహా పరిశ్రమలు 1.24 శాతంగా ఉంటే, మధ్యతరహా పరిశ్రమలు కేవలం 0.12 శాతం మాత్రమే. యాజమాన్యం విషయానికి వస్తే ఒక వ్యక్తి లేదా కుటుంబ యాజమాన్యంలో ఉన్నవి 59 శాతం కాగా భాగస్వామ్య కంపెనీలు 16 శాతం మేరకు ఉన్నాయి. ఎల్ఎల్‌పి 1 శాతం కాగా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు 23 శాతం, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు 1 శాతం మేరకు ఉన్నాయి. యావద్భారతదేశంలో ఇంచుమించు 7,34,00,000 ఎమ్ఎస్ఎమ్ఈలు ఉన్నాయి. మార్చి 2025 నాటికి ఉద్యామ్ పోర్టల్‌లో నమోదయి ఉన్న కంపెనీలు 6,20,00,000. ఎమ్ఎస్ఎమ్ఈల రంగంలో పరపతి లోటు (అవసరమైన ఆర్థిక వనరులు, వాస్తవంగా అందుతున్న రుణ సదుపాయం మధ్య వ్యత్యాసం) 24 శాతం (రూ. 30లక్షల కోట్లు) కాగా, సర్వీసెస్ సబ్ సెక్టార్‌లో ఈ లోటు 27 శాతం కాగా మహిళల యాజమాన్యంలో ఉన్న కంపెనీలకు పరపతి లోటు 35 శాతం మేరకు ఉన్నది. 2023%-%24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ సరుకుల ఎగుమతులలో ఎమ్ఎస్ఎమ్ఈల వాటా 45 శాతం. 2024%-%25లో తమ ఉత్పత్తులను ఎగుమతి చేసిన కంపెనీలు 1,73,350 మాత్రమే. (మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో ఇవి కేవలం 1 శాతం మాత్రమే) ఇవి ఎగుమతి చేస్తున్న ప్రధాన సరుకులు రెడీమేడ్ వస్త్రాలు, ఆభరణాలు, చర్మ ఉత్పత్తులు, చేతి వృత్తుల ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఆహారాలు, ఆటోమోబైల్స్ విడిభాగాలు. వీటిలో ఒకటి మినహా మిగతావన్నీ ఉత్పత్తికి ఖరీదైన సాంకేతికతలు అవసరం లేని సామాన్య వస్తువులే. ఎమ్ఎస్ఎమ్ఈల పురోగతికి రుణ సదుపాయ పథకాలు, అభివృద్ధి సహాయ కార్యక్రమాలు చాలా ఉన్నాయి. ప్రస్తావిత అధికారిక నివేదికలను బట్టి కనీసం రెండు సబ్సిడీ పథకాలు, నాలుగు క్రెడిట్ గ్యారంటీ పథకాలు, కనీసం 13 అభివృద్ధి సహాయ పథకాలు ఉన్నట్టు నాకు అర్థమయింది. 2025%-%26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ కొత్తగా ఈ రంగంలోకి ప్రవేశించిన వారికి ఒక సబ్సిడీ పథకాన్ని, ఒక క్రెడిట్ కార్డ్ పథకాన్ని ప్రకటించింది. అంతేకాకుండా ఒక కొత్త ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఒక డీప్ టెక్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, వీధుల్లో బళ్లపై వివిధ సరుకులు పెట్టుకుని అమ్ముకునే వారికి ఒక నిధి (పీఎమ్ స్వనిధి)ని ప్రకటించింది. ఉద్యోగాల సృష్టికి ప్రధాన ఆధారం ఎమ్ఎస్ఎమ్ఈలే. ఈ రంగం మొత్తం 26 కోట్ల మందికి ఉద్యోగ సదుపాయాన్ని కల్పిస్తోందని ప్రభుత్వం ప్రకటించింది. ఇక ఇప్పుడు ఒక ప్రధాన ప్రశ్నను తరచి చూద్దాం. ప్రస్తావిత అధికారిక నివేదికల ప్రకారం ఎమ్ఎస్ఎమ్ఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు: నిపుణ కార్మికుల కొరత, నైపుణ్యాల లోటు, ప్రతిభావంతులను ఆకట్టుకోవడంలో కష్టసాధ్యాలు. ఈ నివేదికలు వెల్లడించిన వాస్తవాలు మన దేశంలో నిరుద్యోగిత సంపూర్ణ కథను విశదం చేస్తున్నాయి. రూ.125 కోట్ల గరిష్ఠ పెట్టుబడులతో మొత్తం రూ.500 కోట్ల వ్యాపారం చేస్తున్న పెద్ద పరిశ్రమలు ఉన్నత విద్యార్హతలు, మెరుగైన నైపుణ్యాలు ఉన్నవారిని కార్మికులుగా, ఉద్యోగులుగా నియమించుకుంటున్నాయి. నిరుద్యోగులుగా ఉన్నవారిలో అత్యధికులకు అటువంటి విద్యార్హతలు, నైపుణ్యాలు కొరవడడం ఒక వాస్తవం. ఎమ్ఎస్ఎమ్ఈలకు కార్మికుల అవసరం చాలా ఉంది.
అయితే ఈ పరిశ్రమలు కూడా కార్మికుల కొరత నెదుర్కొంటున్నాయి, ప్రతిభావంతులను ఆకర్షించలేకపోతున్నాయి. ఎందుకని? మొదటి కారణం%-% ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నవారికి సంబంధిత ఉద్యోగాలకు అవరమైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదుబీ రెండో కారణం%-% ఈ పరిశ్రమలు సమకూరుస్తున్న ఉద్యోగాలలో చేరేందుకు యువజనులు ఆసక్తి చూపడం లేదు. అవి ఇవ్వజూపుతున్న వేతన భత్యాలు సంతృప్తికరంగా లేకపోవడం వల్లే ఆ ఉద్యోగాల పట్ల యువత విముఖత చూపుతోంది. పైగా ఈ పరిశ్రమలు నిర్వహిస్తున్న కంపెనీలలో చేరడమనేది సమాజంలో ప్రతిష్ఠాకరం కాకపోవడం కూడా ఆ విముఖతకు కారణమవుతోంది. ఎమ్ఎస్ఎమ్ఈల వ్యవస్థాగత వాస్తవాలు, ఉద్యోగిత పరిణామాలను బట్టి యువ భారతీయులలో నిరుద్యోగిత అధికంగా ఎందుకు ఉన్నదో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. ఏప్రిల్ 2025లో భారత జనాభా 146 కోట్లు. కార్మిక శక్తి భాగస్వామ్యం (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ %-% ఎల్ఎఫ్‌పిఆర్) అంటే ఉద్యోగాలలో ఉన్నవారు, ఉద్యోగం కోసం క్రియాశీలంగా ప్రయత్నిస్తున్నవారు వెరసి మొత్తం ప్రజలు 81 కోట్లు (55.6 శాతం). ఉపాధి పొందుతున్న జనాభా నిష్పత్తి (వర్కర్ పాపులేషన్ రేషియో -డబ్ల్యుపిఆర్) 52.8 శాతం (77 కోట్లు). ఈ రెండు గణాంకాల మధ్య వ్యత్యాసం (4 కోట్లు) నిరుద్యోగుల సంఖ్యను వెల్లడిస్తుంది. వీరంతా నిరుద్యోగులు. నిరుద్యోగుల సంఖ్య చాలా హెచ్చుగా ఉన్నది, సందేహం లేదు. అయితే ఈ నిరుద్యోగులు అదరూ 'ఉద్యోగానికి క్రియాశీలంగా ప్రయత్నిస్తున్న జనాభా'లోని వారేనన్న విషయాన్ని విస్మరించ కూడదు. వివిధ కారణాలతో ఉద్యోగ ప్రయత్నాలను విరమించిన వారు లక్షల సంఖ్యలో ఉన్నారనేది కూడా మరువకూడదు. 81 కోట్ల శ్రామిక జనావళిలో నిరుద్యోగులు 4 కోట్ల మంది అంటే నిరుద్యోగిత 5.0 శాతం. ఇది అధికారిక గణాంకం. ఎమ్ఎస్ఎమ్ఈలలో అత్యధికం (98.64 శాతం) సూక్ష్మ పరిశ్రమలే. యాజమాన్యం, భాగస్వామ్యం మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో 75 శాతం మేరకు ఉన్నదనే వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ రంగం కంపెనీలలో ఉద్యోగులు లేదా కార్మికులుగా ఉన్న 26 కోట్ల మందిలో చాలా మంది కుటుంబ సభ్యులు లేదా యాజమానుల బంధువులే అయివుంటారన్నది స్పష్టం. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల (మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో 1.36 శాతం లేదా ఇంచుమించు 10,00,000)లో మాత్రమే కుటుంబ, బంధుత్వాల వెలుపలి వారిని నియోగించుకోవడం జరుగుతోంది.

# అందరి ఆకలి తీరేదెప్పుడు?



ఆకలి అనే నిజం ఎన్నో గుండెలను చిల్లులు చేసి, ఎన్నో కడుపులను మాడ్చివేస్తుంది. నాగరికత పరుగులెత్తుతోంది, టెక్నాలజీ అద్భుతాలు సృష్టిస్తోంది. కానీ ఆకలితో ఉన్నవారు మాత్రం అలానే ఉంటున్నారు, ఏ మార్పూ లేకుండా. ఇది మనల్ని వెంటాడే ఒక చేదు నిజం, మన సామాజిక పురోగతికి అద్దం పట్టే ఒక భయంకరమైన చిత్రం.



ఆహారం ఉంది, కానీ అది అందరికీ అందడం లేదు. ఎందుకు? అని ప్రశ్నించుకుంటే, యుద్ధాలు, వాతావరణ విపత్తులు, ఆర్థిక మాంద్యాలు, ఇంకా లోతుగా వేళ్లూనుకున్న అసమానతలు %-% ఇవన్నీ ఆకలి అనే రాక్షసుడికి ఆజ్యం పోస్తున్నాయి అనే సమాధానం వస్తుంది. భూమి మన ఆకలి తీర్చడానికి పుష్కలంగా పండిస్తోంది. కానీ, ఆకలి కేవలం కడుపుని కాల్చే మంట కాదు, అది మనిషి శారీరక, మానసిక, సామాజిక జీవనాన్ని అతలాకుతలం చేసే అగ్నికీల.

విశ్వవ్యాప్త విషాదం -ఆకలి చిత్రాలు:

ప్రపంచవ్యాప్తంగా ఆకలి సమస్య ఎంత తీవ్రంగా ఉందో గణాంకాలు కళ్ళ ముందు ఉంచుతున్నాయి. 2024 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్ చెప్పిన లెక్కలు గుండెలను బరువెక్కిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 78.3 కోట్ల మందికి పైగా ఆకలి అనే మంటతో నిత్యం పోరాడుతున్నారు. 2023లో సంక్షోభ ప్రాంతాల్లో 28.2 కోట్ల మందికి పైగా తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. ఇది కేవలం సంఖ్య కాదు, ప్రతి సంఖ్య వెనుక ఒక జీవితం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉంది. ఆహార వ్యవసాయ సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 42% మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. అంటే, సగం మందికి పైగా ప్రజలు కనీసం పోషక విలువలున్న ఆహారం కూడా తినలేకపోతున్నారు. ఇది నిజంగా మానవాళి సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం.

భారతదేశంలో ఆకలి నగ్న సత్యం:

మన భారతదేశం అపారమైన వ్యవసాయ సంపద ఉన్న దేశం. అయినా కూడా, ఆకలి, పోషకాహార లోపం అనేవి ఇక్కడ తీరని గాయాలు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే -5 గణాంకాలు కళ్ళు తెరిపిస్తున్నాయి. మన దేశంలో సుమారు 16% మంది పోషకాహార లోపంతో అలమటిస్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లలలో 35.5% మంది వయస్సుకి తగ్గ ఎత్తు లేరు, 19.3% మంది ఎత్తుకి తగ్గ బరువు లేరు. ఏకంగా 32.1% మంది పిల్లలు తక్కువ బరువుతోనే ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉన్న మన దేశంలో ఈ పరిస్థితి మనల్ని కలవరపెడుతుంది. మహిళల విషయానికొస్తే, ప్రపంచవ్యాప్తంగా కోటి మందికి పైగా మహిళలు, కౌమార బాలికలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సంఖ్యలో మనదేశం నుండి గణనీయమైన వాటా ఉంది. తల్లి కడుపు నిండకపోతే, పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యం ఎలా? ఈ పోషకాహార లోప చక్రం తరతరాలుగా కొనసాగుతోంది. ఐదేళ్ల లోపు పిల్లలలో సంభవించే మరణాలలో దాదాపు 45% పోషకాహార లోపం వల్లనే సంభవిస్తున్నాయని అంచనా. ఇది ఒక అదృశ్య విషాదం, ప్రతిరోజూ మన కళ్ళ ముందే జరుగుతున్న ఘోరం.

ఆకలికి ఆజ్యం పోసే కారణాలు:

ఆకలి సమస్యకు మూలాలు బహుముఖంగా ఉన్నాయి. వాతావరణ మార్పులు అస్తవ్యస్తమైన వర్షపాతం, కరువులు, వరదలు, వడగాల్పులు వంటి రూపాల్లో ఆహార ఉత్పత్తిని నిరంతరం బెదిరిస్తూనే ఉన్నాయి. వర్షాలు పడకపోవడం లేదా ఎక్కువగా పడటం వల్ల రైతుల పంటలు పాడైపోతున్నాయి. అప్పుడు వారు తినడానికి తిండి లేక, అప్పుల పాలై ఆకలితో అల్లాడుతారు. దీనికి తోడు, ఆర్థిక అసమానతలు ఆహారం అందుబాటులో ఉన్నప్పటికీ, అందరికీ అందుబాటులో ఉండకుండా చేస్తున్నాయి. పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు చాలా ఖరీదుగా ఉండటంతో, చాలా మంది పేదలకి అవి అందుబాటులో ఉండవు. ఈ ఆహార భద్రత లేమి పేదరికాన్ని మరింత పెంచుతుంది, పిల్లలను బడికి దూరం చేస్తుంది, పెద్దల పని సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. సామాజికంగా, పోషకాహార లోపంతో బాధపడే పిల్లలు చదువులో వెనుకబడి, జీవితాంతం తక్కువ సంపాదనతో జీవిస్తారు. పెద్దలు అలసటతో, ఏకాగ్రత లోపంతో బాధపడతారు. ఆకలి సమాజాలను రాజకీయ అస్థిరతకు, ఘర్షణలకు మరింత గురి చేస్తుంది.

ఆకలి లేని సమాజం కోసం పరిష్కార మార్గాలు:

కడుపు నిండా తినే హక్కు ప్రతి మనిషికి ఉంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన, ఆహార హక్కును ప్రాథమిక మానవ హక్కుగా గుర్తిస్తుంది. ఒక విత్తనం నాటితే అది పెద్ద చెట్టై పండ్లు ఇచ్చినట్లుగా, మనం ఇప్పుడు వేసే చిన్న చిన్న అడుగులు, దీర్ఘకాలంలో పెద్ద మార్పును తీసుకువస్తాయి. కేవలం కడుపు నింపడం కాదు, ఆ కడుపుని నింపే వ్యవస్థలకు ప్రాణం పోయాల్సిన సమయమిది.
వ్యవస్థాగత మార్పులు ఆకలి సమస్యలను తట్టుకుని, మళ్ళీ నిలబడే శక్తిని, బలాన్ని కలిగించే వ్యవస్థలను తయారు చేయాలి. స్థితిస్థాపక ఆహార సరఫరా గొలుసులను నిర్మించడం, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించడం ఇవన్నీ ఇందులో భాగం.
చిన్న రైతులకు మద్దతు అందించడం అత్యవసరం. వాతావరణ మార్పుల సుడిగుండంలో చిక్కుకుపోయి, ప్రతి రోజూ బతుకు కోసం పోరాడుతున్న చిన్న రైతులకు, ముఖ్యంగా మహిళలకు అండగా నిలబడాలి. స్థానిక ఆహార వ్యవస్థలకు వారే వెన్నెముక. వారికి వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, అప్పులు, సాంకేతికత, మార్కెట్ అనుసంధానాలు కల్పించడం ద్వారా మరింత సురక్షితమైన, సమానమైన ఆహార పంపిణీకి బాటలు వేయవచ్చు. మహిళా రైతులకు వనరులకు సమాన ప్రాప్యత ఉన్నప్పుడు, వ్యవసాయ ఉత్పత్తి 30% వరకు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.
ప్రభుత్వ పథకాలు, సమర్థవంతమైన అమలు కీలక పాత్ర పోషిస్తాయి. మన భారతదేశం ఈ సమస్యకు స్పందించే తీరులో స్వల్పకాలిక ఉపశమనం మరియు దీర్ఘకాలిక వ్యవస్థాగత మార్పు రెండూ ఉండాలి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, మధ్యాహ్న భోజన పథకం, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ వంటి పథకాలు కొంత వరకు ఫలితాలనిచ్చినా, వాటి అమలులో లోపాలు, లీకేజీలు, ఇంకా అందరికీ అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పోషకాహార-సున్నితమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఆహార వైవిధ్యాన్ని పెంచడం తక్షణ అవసరం. మారుమూల, గిరిజన ప్రాంతాలలో ఇనుము, ప్రోటీన్, సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే ఆహారాలు లభించేలా చూసుకోవడం చాలా కీలకం. కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే కాకుండా, ప్రైవేట్ రంగం కూడా ఆహార నష్టాన్ని, వ్యర్థాలను తగ్గించడంలో, స్థానిక రైతులకు మద్దతు ఇవ్వడంలో, పౌష్టికాహారాన్ని అందించే ఉత్పత్తులలో పెట్టుబడి పెట్టడంలో భాగస్వామ్యం వహించాలి. వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు అవసరం. రైతులు ప్రకృతి విపత్తులను తట్టుకునేలా మనం వారికి సహాయం చేయాలి. కరువును తట్టుకునే, తక్కువ నీటితో పండే పంటల విత్తనాలను రైతులకు అందివ్వాలి. తక్కువ నీటిని వాడే డ్రిప్ ఇరిగేషన్ వంటి నూతన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టాలి. పంటలు నష్టపోయినా వారికి కొంత డబ్బు వచ్చేలా ఇప్పటి కంటే ఇంకా ఎక్కువ భీమా పథకాలు ఏర్పాటు చేయాలి. పండిన పంటను సరైన ధరకి అమ్ముకోవడానికి మార్కెట్లకు అనుసంధానం కల్పించాలి. చివరిగా, మన దేశంలో చాలా ఆహారం పండుతున్నా, అది పేదలందరికీ సరిగా చేరడం లేదు. మధ్యలో వృథా అవుతోంది లేదా దళారుల చేతుల్లోకి వెళ్తోంది. ఆహారం అందరికీ చేరేలా ఒక బలమైన వ్యవస్థను నిర్మించాలి.

ఆకలి లేని రేపటి కోసం మనవంతు కృషి:

పేదరికం ఆకలికి దారితీసి, అది తిరిగి పేదరికాన్ని పెంచే ఈ ఆకలి చక్రాన్ని బద్దలు కొట్టాలి. వాతావరణ అనుకూల వ్యూహాలు, విపత్తు ప్రమాద తగ్గింపు, పోషకాహార-సున్నితమైన విద్యలో పెట్టుబడులు కలిసే జరగాలి. ఆకలిని కేవలం ఆహార సమస్యగా కాకుండా, సామాజిక, ఆర్థిక, పర్యావరణ న్యాయ సమస్యగా గుర్తించాల్సిన సమయం ఇది. మనం ప్రజలలో, ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారిలో పెట్టుబడి పెట్టాలి, ఇంకా ఉత్పాదకమైనవి మాత్రమే కాకుండా, అందరినీ కలుపుకుపోయే, సమానమైన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించాలి.
ఆకలి లేని రేపటి కోసం, ఏ బిడ్డ కూడా ఆకలితో నిద్రపోకుండా, ఏ తల్లి బలహీనతతో బిడ్డను కనకుండా, ఏ రైతు ఒంటరిగా పోరాడకుండా చూసేందుకు మనం కట్టుబడి ఉందాం. ఎక్కడ ఆకలి ఉన్నా, అది మానవాళికి ముప్పు అని గుర్తుంచుకుందాం. మన చుట్టూ ఉన్న ఆకలి కేకలను విందాం, మన వంతు సాయం చేద్దాం. రేపటి తరం ఆకలి లేని సమాజంలో జీవించేలా మనవంతు కృషి చేద్దాం! ఈ మహత్తర కార్యంలో మనమంతా భాగమవుదాం.

జనక మోహన రావు దుంగ
8247045230

# అందాల పోటీలను నిషేధించాలి



తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అత్యం త ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 2025పోటీలపై నిరసనలతో పాటు అంతే తీవ్రంగా విమర్శలు వెలువెత్తుతూనే ఉన్నాయి. మొత్తంగా'అందాల పోటీలను రద్దు చేయాలి' అని అంటూ మహిళా సంఘాలు తెలంగాణ రాష్ట్రవ్యా ప్తంగాఅనేక ఆందోళనలు నిర్వహించారు. నిరసనలు తెలియ జేయకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసులు ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్యనిఏకంగా గృహ నిర్బంధానికి గురిచేయడమే కాకుండా అనేక మంది మహిళా సంఘాలనాయకురాలను మరియు కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి ప్రజాందోళనల మేరకువిడుదల చేశారు. ఎన్నికల్లో మహిళలకి తాయిలాలు ప్రకటించి వారి ఓట్లతోనే గద్దెనెక్కిఅంతిమంగా వారి పైననే నిర్బంధం కొనసాగించడం నిర్బంధ పాలనకు నిదర్శనంగాని లుస్తుంది అని చెప్పవచ్చు.రాష్ట్రంలో ఒకపక్క హామీలు అమలుకు నోచుకోకపోగా మరోపక్క మరెన్నో సమస్యలుతిష్ట పరచుకుని ఉండగా ప్రభుత్వం వాటిని విస్మరించి నిర్బంధాన్ని ప్రయోగించి మొండిపట్టుదలతో అందాల పోటీలను నిర్వహిస్తూనే ఉంది. కాని ఈ అందాల పోటీల నిర్వహణ వలనపేద మరియు మధ్య తరగతి ప్రజలకు ఒరిగేది ఏమి లేదు. మార్కెట్ ప్రపంచం లోపెట్టుబడిదారుల మరియు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే అందాల పోటీలనునిర్వహిస్తున్నారు' అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. ఇది ఇలా ఉండగా గత వారం కిందటఐకానిక్ రామప్ప



ఆలయాన్ని సందర్శించిన సమయంలో స్థానిక మహిళలు అందాలపోటీదారుల పాదాలను కడిగించడంపై అనేకంగా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రపంచ సుందరికిరీటాన్ని సాకారం చేసుకోవాలనే లక్ష్యంతో మే 7 నాడు హైదరాబాద్ చేరుకున్న 24 ఏళ్లమిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఇటీవల ఆ అందాల పోటీల నుంచి మధ్యలోనే నిష్క్రమించడం ప్రపంచ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది అని చెప్పవచ్చు. ఈ రకంగా 72 ఏండ్ల ప్రపంచసుందరి పోటీల్లో ఇంగ్లండ్ నుంచి ఓ పోటీదారు అర్థాంతరంగా పోటీ మధ్యలోనే వైదొలగడం ఇదేమొదటిసారి కావడం గమనార్హం.మిల్లా మాగీ అందాల పోటీలలో తాను ఎదుర్కొన్న అవమానాలను బ్రిటీష్ మీడియా తోతీవ్రమైన మనోవేదనతో వ్యక్తీకరించడాన్ని ప్రతి ఒక్కరిని తీవ్రంగా కలచివేసింది అనిచెప్పవచ్చు. 'మిస్ వరల్డ్ పోటీలు విలువలతో కూడి ఉంటాయి అని నేను భావించాను.సమాజంలో మార్పు కోసం ముఖ్యంగా భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచి ప్రపంచ కిరీటం సాధించాలన్న ఆశతో నేను ఈ పోటీల్లో పాల్గొనడానికి వెళ్ళాను. కాని ఊహించని అనుభవాలుఎదురయ్యాయి. ఏదో ఆటబొమ్మలా కూర్చోవాల్సి వచ్చింది. ఏదో వినోదం పండించడానికేవచ్చినట్టు నిర్వాహకులు నన్ను చూశారు. ధన్యవాదాల పేరుతో ధనవంతులైన కొందరుమధ్య వయసు మగవారిని ఎంటర్‌టైన్ చేయమని నాకు చెప్పారు. ఉదయం నుంచి రాత్రివరకు ఈవినింగ్ గౌనులు ధరించి విపరీతమైన మేకప్ వేసుకొని ఉండాలి. నిర్వాహకులవ్యవహారాలతో కొన్ని రోజుల పాటు నాకు నిద్ర కూడా పట్టలేదు. నన్ను మరియు ఇతరపోటీదారులను వారు అంగడి సరుకుగా చూశారు. అంతిమంగా నేను ఒక వేశ్య అనుకునేస్థాయికి నన్ను దిగజారేలా చేశారు. ఇంకా ఇలాంటి అనేక చేదు అనుభవాలు నేనుచెప్పుకోలేని తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. అక్కడ కొనసాగడానికి నా నైతికతఒప్పుకోలేదు. ఈ అనైతిక వ్యవహారాలు నచ్చకపోవడం వల్లే నేను అందాల పోటీల నుంచివిరమించుకున్నాను' అని మిల్లా మాగీ బ్రిటిష్ టాబ్లాయిడ్ 'ది సన్' మీడియాకి ఇచ్చినఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేయడం నేడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.మిస్ ఇంగ్లండ్ కిరీటాన్ని సాధించిన మిల్లా మాగీని ఇలా పురుషాధిక్యత సవాల్‌విసురుతుంటే ఇక సామాన్య మహిళల పరిస్థితులు మరెంత తీవ్రంగా ఉండగలవో ఊహించవచ్చు. అయితే 'మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలు నిరాధారమైనవి.యు.కె పత్రికా కథనాలు వాస్తవ దూరం. అవి మిస్ వరల్డ్ సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేలాఉన్నాయి. భారత్‌లో పోటీ జరుగుతున్న సమయంలో మిల్లా మాగీ చాలా సంతోషంగాఉన్నారు. వాటికి సంబంధించిన వీడియోలు కూడా విడుదల చేశాం. తన తల్లి ఆరోగ్యం క్షీణించిందని మిల్లా మాగీ చెప్పడంతోనే పోటీల నుంచి వైదొలగడానికి ఆమెకుఅనుమతినిచ్చాం' అని మరోవైపు మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సి.ఇ.ఓ, చైర్‌పర్సన్ జూలీమోర్లే పేర్కొనడం గమనార్హం. ప్రజల నుండి వెలువెత్తిన విమర్శల కారణంగా మిస్ ఇంగ్లాండ్‌మిల్లా మాగీ చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ ప్రభుత్వం ఆమె ఆరోపణల్లోనిజానిజాలను తేల్చేందుకు సీనియర్ ఐ.పి.ఎస్ అధికారిణి శిఖా గోయల్ నేతృత్వంలో త్రిసభ్యకమిటీని కమిటీని ఏర్పాటు చేయడం శుభపరిణామం. తద్వారా మిల్లా మాగీ ఆరోపణల్లోనిజానిజాలు వెలుగు చూడనున్నాయి. ఒకవేళ ఆమె ఆరోపణలు వాస్తవమైన పక్షంలోసంబంధిత బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకోవాలి.అందాల ఆరబోతల ద్వారా అంతర్జాతీయ కంపెనీల నుంచి తెలంగాణకు పెట్టుబడులనుతీసుకురావాలి అనే ప్రభుత్వ విపరీతబుద్ధిని ప్రజానీకం తీవ్రంగా ప్రతిఘటిస్తూనే ఉన్నారు.ప్రపంచ సుందరి పోటీలకు కాలం చెల్లింది. ప్రపంచాన్ని మార్చడానికి నీ గొంతు విప్పడంముందు ఆ కిరీటాలు, సాషేలు ఎందుకూ పనికిరావు' అని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీపేర్కొనడం గమనార్హం. మిల్లా మాగీ ఆరోపణలతో మొత్తంగా అందాల పోటీల అస్తిత్వంప్రమాదంలో పడినది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. 'మిస్ వరల్డ్ పోటీల నిర్వహణడొల్లతనాన్ని మిల్లా మాగీ వెలుగులోకి తీసుకువచ్చి మహిళలకు కనువిప్పు కలిగించారు'అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. ఏది ఏమైననూ అందాల పోటీల ముసుగులోకొనసాగుతున్న అనైతికతను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.అంతిమంగా భవిష్యత్తులో అందాల పోటీలను సమూలంగా నిషేధించే దిశగా ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

భక్తి

## బుద్ధఘోషుడి జ్ఞానదీక్ష



బౌద్ధ ధర్మంలోని మహాయాన మార్గంలో ఆచార్య నాగార్జునుడిది ఎంత గొప్ప స్థానమో... థేరవాదంలో బుద్ధఘోషుడిది అంతటి ఉన్నతమైన స్థానం. దీనికి కారణం అతనిలో నేర్చుకోవాలనే జిజ్ఞాస. జ్ఞాన సాధనకు పట్టుదల, కృషి ఎంతో అవసరమని అతని కథ చెబుతుంది. బుద్ధఘోషుడు క్రీస్తుశకం నాలుగు, అయిదు శతాబ్దాలకు చెందినవాడు. అతను తెలుగువాడనే అభిప్రాయం కూడా ఉంది. బాల్యం నుంచే జ్ఞానతృష్ణ కలిగిన బుద్ధఘోషుడు... ఎక్కడ పండితులు ఉన్నారని తెలిస్తే అక్కడికి వెళ్ళేవాడు. వారితో చర్చలు జరిపేవాడు. చివరకు ఒక బౌద్ధ విహారానికి చేరుకున్నాడు.అతనికి ఆ విహారాధిపతి ఆచార్య రేవతుడు ఆశ్రయం ఇచ్చాడు. అప్పటికే చీకటిపడింది. నిద్రపోవడానికి ముందు బుద్ధఘోషుడు సముద్ర ఘోషలాంటి గంభీర స్వరంతో పతంజలి యోగ సూత్రాలను వల్లె వేశాడు. వాటిని జాగ్రత్తగా విన్న రేవతుడు "ప్రస్తుతానికి విశ్రాంతి తీసుకో. రేపటి ఉదయం నా వద్దకు రా" అన్నాడు.మరుసటిరోజు ఉదయం రేవతుణ్ణి బుద్ధఘోషుడు కలుసుకున్నాడు. అప్పుడు రేవతుడు "రాత్రి గాడిదలా ఓండ్ర పెట్టింది నువ్వేనా?" అని ప్రశ్నించాడు.అప్పుడు బుద్ధ ఘోషుడు "నాది గాడిద ఓండ్ర అంటున్నారే? నేను చదివినది మీకు కాస్తయినా అర్థమయిందా?" అని అడిగాడు. రాత్రి తనకు విశ్రాంతి కోసం విహారంలో చోటు ఇచ్చిన వ్యక్తితో ఏమాత్రం తటపటాయించకుండా మాట్లాడిన బుద్ధఘోషుడి ఆత్మవిశ్వాసం, కపటంలేనితనం రేవతుడికి నచ్చాయి. ఆయన చిరునవ్వు నవ్వుతూ బుద్ధఘోషుడి భుజం తట్టి "అలా కూర్చో" అని తన ఎదుట ఉన్న ఆసనాన్ని చూపించాడు. పతంజలి యోగ సూత్రాలను చాలా స్పష్టంగా వల్లిస్తూ... వాటిపై అద్భుతమైన వ్యాఖ్య చేశాడు. ఆశ్చర్యంతో నోట మాటరాక... కొయ్యబొమ్మలా కూర్చొని వినడం బుద్ధఘోషుడి వంతయింది. తనకు 'తెలిసింది గోరంత, తెలుసుకోవలసింది కొండంత' అని అర్థమయింది. అతని అహంకారం అణగిపోయింది. రేవతుడి ముందు వె ా క రి ల్లా డ ు .
తనను శిష్యుడిగా స్వీకరించి జ్ఞానబోధ చేయాలని రెండు చేతులూ జోడించి ప్రార్థించాడు.అప్పుడు రేవతుడు 'అభిదమ్మ పిటకం' నుంచి కొంత భాగాన్ని చదివి వినిపించి "దీన్ని 'సమ్మా సంబుద్ధవాదం' అంటారు. దీని గురించి తెలుసుకోవాలంటే ముందుగా ప్రవజ్య దీక్ష తీసుకోవాలి" అన్నాడు. బుద్ధఘోషుడు తక్షణమే తన అంగీకారం తెలిపాడు. అతని కంఠస్వరంలోని గాంభీర్యాన్ని చూసి... రేవతుడు ఇచ్చిన దీక్షానామమే బుద్ధఘోష. దానితో అతని అసలు పేరు మరుగున పడిపోయి... ఆ పేరే జగత్ప్రసిద్ధం అయింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
బుధవారం
28 ၊ మే ၊ 2025






# తమ్ముడి కొడుకుకు ఆశీర్వాదాలు తెలిపిన తేజ్‌ప్రతాప్ యాదవ్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**రెండు రోజుల క్రితమే ఆర్జేడీ పార్టీ నుంచి, లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం నుంచి బహిష్కరణకు గురైన లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ . ఇవాళే (మంగళవారం) జన్మించిన తన తమ్ముడి కుమారుడికి ఆశీర్వాదాలు అందించారు. తన తమ్ముడు, మరదలుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు.

'నేను ఇవాళ మరో బిడ్డకు పెద తండ్రిని కావడం నా అదృష్టం. రెండో సంతానానికి తల్లిదండ్రులైనందుకు నా తమ్ముడు తేజస్వి యాదవ్‌కు, మరదలు రాజ్‌శ్రీ యాదవ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. కొత్తగా జన్మించిన బిడ్డకు నా ప్రేమపూర్వక ఆశీర్వచనాలు' అని తేజ్‌ప్రతాప్ యాదవ్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇవాళ ఉదయం తేజస్వి యాదవ్, రాజ్‌శ్రీ యాదవ్ దంపతులకు మగబిడ్డ జన్మించాడు. కాగా వ్యక్తిగత జీవితంలో కుటుంబ విలువలు, సంప్రదాయాలు పాటించడం లేదని, తన తీరుతో సామాజిక న్యాయం కోసం తాము చేస్తున్న పోరాటాన్ని బలహీనం చేస్తున్నారని ఆరోపిస్తూ తేజ్ ప్రతాప్ యాదవ్‌ను రెండు రోజుల క్రితం ఆర్జేడీ నుంచి, కుటుంబం నుంచి బహిష్కరించారు. తేజ్‌ప్రతాప్‌ను ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని, కుటుంబం నుంచి కూడా అతడిని వెలేస్తున్నామని లాలూ యాదవ్ అదివారం ప్రకటించారు. తాను ఒక మహిళతో గత 12 ఏళ్లుగా రిలేషన్‌లో ఉన్నానని తెలుపుతూ శనివారం తేజ్‌ప్రతాప్ యాదవ్ తన ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టు గంటల్లోనే వైరల్ అయ్యి సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

## ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ కోసం గడువు పొడిగింపు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆదాయం పన్నుశాఖ కీలక ప్రకటన చేసింది. ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ కోసం ఫైలింగ్ తేదీ గడువును పెంచారు. 2025-26 సీజన్ కోసం ఐటీ రిటర్న్ దాఖలు కోసం జూలై 31 నుంచి గడువును సెప్టెంబర్ 15వ తేదీ వరకు పెంచినట్లు ఐటీశాఖ చెప్పింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ) ఇవాళ ఓ ప్రకటన రిలీజ్ చేసింది. ఐటీఆర్ దాఖలు విషయంలో విస్తృత స్థాయిలో మార్పులు జరిగాయని, అయితే కొత్త తరహా ఐటీఆర్‌ను తెలుసుకునేందుకు గడువును పెంచుతున్నట్లు ఐటీశాఖ పేర్కొన్నది. పన్నుదారులకు సరళమైన రీతిలో ఫైలింగ్ జరిగేందుకు గడువును పెంచుతున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగానే జూలై 31 వరకు ఉన్న ఐటీఆర్ ఫైలింగ్ తేదీని సెప్టెంబర్ 15కు పొడిగిస్తున్నట్లు సీబీడీటీ తెలిపింది.

## పహల్గాం ఉగ్రదాడి జరిగిన ప్రదేశంలో జమ్ముకశ్మీర్ క్యాబినెట్ భేటీ

**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్ముకశ్మీర్ లోని పహల్గాం సమీపంలోగల బైసరన్ లోయ లో జరిగిన ఉగ్రదాడితో యావత్ భారతదేశం ఉలిక్కిపడింది. ఇవాళ ఆ ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో జమ్ముకశ్మీర్ క్యాబినెట్ ప్రత్యేకంగా సమావేశమైంది. పిరికిపంద చర్యలకు తాము ఏమాత్రం భయపడబోమనే సందేశం టెర్రరిస్టులకు చేరేలా జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఈ సమావేశం నిర్వహించింది. జమ్ముకశ్మీర్‌లోని వేసవి రాజధాని శ్రీనగర్, శీతాకాల రాజధాని జమ్ము కాకుండా వెలుపల ఇలా అక్కడి క్యాబినెట్ భేటీ కావడం ఈ నూతన ప్రభుత్వ హయాంలో ఇదే తొలిసారని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ప్రకృతి అందాలకు నెలవైన పహల్గాంలోని బైసరన్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు బలయ్యారు. దాంతో అప్పటి నుంచి పర్యాటకుల రాక తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో పర్యాటకంపైనే ఆధారపడిన స్థానిక ప్రజలకు సంఘీభావంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఒమర్ మీడియాకు వెల్లడించారు. 'మేం ప్రజల ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నాం. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పహల్గాంకు వచ్చాం. ఆ దిశగా చర్యలు కొనసాగుతాయి' అని ఒమర్ అబ్దుల్లా అన్నారు. పహల్గాం క్లబ్‌లో జరిగిన మీటింగ్ దృశ్యాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు ఏ మాత్రం భయపడేదిలేదనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చామని, జమ్ముకశ్మీర్ దృఢంగా నిలబడుతుందని ఆ పోస్టులో రాసుకొచ్చారు. కాగా 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఒమర్ అబ్దుల్లా.. ఉత్తర కశ్మీర్‌లోని గురెజ్, మచిల్, తాంగ్‌ధర్, జమ్ము ప్రాంతంలోని రాజౌరీ, పూంచ్‌లో ఇలా క్యాబినెట్ సమావేశాలు నిర్వహించారు. ప్రధాని మోదీ అధ్యక్షత వహించే నీతిఆయోగ్ సమావేశాన్ని ఇక్కడ నిర్వహించాలని అభ్యర్థించారు. ఈ తరహా చర్యలు స్థానిక ప్రజల్లో భయాలను తొలగిస్తాయని విశ్వసిస్తున్నానని చెప్పారు.

## జూన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం: ఐఎండీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ వాతావరణ శాఖ ఇవాళ కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా జూన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతంనమోదు కానున్నట్లు చెప్పింది. జూన్ నెలలో సుమారు 108 శాతం వర్షం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ పేర్కొన్నది. అయితే ఈ వర్షాకాలంలో దేశవ్యాప్తంగా 106 శాతం వర్షపాతం ఉంటుందని, సగటును 87 సెంటీమీటర్ల వర్షం కురవనున్నట్లు ఐఎండీ చెప్పింది. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌కు చెందిన కార్యదర్శి ఎం రవిచంద్రన్ ఇవాళ మీడియా సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలానికి చెందిన కోర్ జోన్‌లో ఈసారి సాధారణం కన్నా ఎక్కువ ర్షం నమోదు అవుతుందన్నారు. మాన్‌సూన్ కోర్ జోన్‌లో మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాలు వస్తాయి. నైరుతి రుతుపవనాల సమయంలో ఈ ప్రాంతానికి ఎక్కువ శాతం వర్షం వస్తుంది. ఈ ప్రాంతంలోని వ్యవసాయం మొత్తం నైరుతి మీద ఆధారపడి ఉంటుంది. వాయువ్య భారతంలో ఈసారి సాధారణ స్థాయి వర్షం ఉండనున్నది. ఈశాన్యలో ఈసారి సాధారణం కన్నా తక్కువ వర్షం ఉంటుందని ఐఎండీ పేర్కొన్నది. సెంట్రల్‌తో పాటు దక్షిణ ద్వీపకల్ప భాగంలో సాధారణం కన్నా ఎక్కువ స్థాయిలో వర్షం పడనున్నట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు.

## సరిహద్దుల్లో ఓ పోస్టుకు 'సింధూర్' పేరు.. బీఎస్ఎఫ్ ప్రతిపాదన

**న్యూఢిల్లీ-నవభూమి:**పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా ఈ నెల రెండో వారంలో పాకిస్థాన్ లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సింధూర్ పేరుతో మెరుపుదాడులు చేసింది. ఏకంగా 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి, 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ నేపథ్యంలో భారత సైన్యం తెగువకు గుర్తుగా సాంబా సెక్టార్‌లోని ఓ పోస్టుకు 'సింధూర్' పేరు పెట్టాలని భారత సరిహద్దు భద్రతా దళం ప్రతిపాదించింది. మే 10న సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో అమరులైన మరో ఇద్దరి పేర్లను కూడా పరిశీలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. మే 10న పాక్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లు, మరో భారత సైనికుడు మరణించారని బీఎస్ఎఫ్ ఐజీ శశాంక్ ఆనంద్ తెలిపారు. 'మే 10న మా పోస్టులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. బీఎస్ఎఫ్ దళాలు వాటిని సమర్థంగా ఎదుర్కొంటున్న క్రమంలో బృందంలోని బీఎస్ఎఫ్ సబ్-ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఇంతియాజ్, కానిస్టేబుల్ దీపక్ కుమార్ ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి సరిహద్దులోని పోస్టులకు వారి పేర్లను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం' అని శశాంక్ చెప్పారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో బీఎస్ఎఫ్ మహిళా సిబ్బంది ఎంతో తెగువతో ఫార్వర్డ్ పోస్టులపై పాక్‌తో పోరాడారని శశాంక్ ప్రశంసించారు. అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలో మహిళా బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు పాక్ డ్రోన్‌లను సమర్థవంతంగా తిప్పి కొట్టారని తెలిపారు. మరోవైపు భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడంతో ఉగ్రవాదులు భారత్‌లో చొరబాటుకు ప్రయత్నిస్తున్నారని.. పాక్ ఆక్రమిత కశ్మీర్ వెంబడి వారు చొరబడే అవకాశం ఉందని నిఘా

# భారతీయ విద్యార్థులపై అమెరికా మరో బాంబ్



**న్యూఢిల్లీ-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ వలసదారులను బలవంతంగా వారి దేశాలకు పంపించేస్తూనే.. వీసా విషయాల్లో కూడా అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ఇప్పటికే విదేశీ విద్యార్థులపై అనేక చర్యలు తీసుకుంటున్న అమెరికా సర్కారు.. తాజాగా మరో బాంబ్ వేసింది. ముఖ్యంగా విద్యార్థి వీసాపై యూఎస్ వెళ్లి తరగతులకు సరిగ్గా హాజరు కాకపోయినా, చదువు మానేసినా వారి వీసాను రద్దు చేస్తామని హెచ్చరిస్తోంది. దీని వల్ల అనేక మంది విద్యార్థులు తిరిగి ఇంటికి రావాల్సిన అవకాశం ఉండగా.. ముఖ్యంగా మరింత మంది భారతీయ విద్యార్థుల వీసాలు రద్దు అయ్యే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు కారణాలతో అమెరికా.. విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తుంది. తాజాగా మరో హెచ్చరిక జారీ చేసింది. తమ విద్యా సంస్థల్లో చదివే భారత్ సహా ఇతర విదేశీ విద్యార్థులు సరిగ్గా తరగతులకు హాజరు కాకపోయినా, అక్కడే ఉంటూ చదువు పూర్తిగా మానేసినా వీసాలను రద్దు చేస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించి భారత్‌లోని అమెరికా ఎంబసీ దీనిపై మంగళ వారం రోజు ఓ ప్రకటన కూడా జారీ చేసింది. విద్యా సంస్థ నుంచి డ్రాపౌట్ అయినా, తరగతులు ఎగ్గొట్టినా, విద్యాసంస్థలకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా మీ విద్యార్థి వీసా రద్దు అవుతుందని తెలిపింది. అలాగే భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసాలకు అయినా మీరు అర్హత కోల్పోతారని చెప్పింది. సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ఈ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండని.. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండని సూచించింది. ఇలా చేయడానికి కూడా ఓ కారణం ఉంది. కొంతమంది విద్యార్థులు చదువు పేరుతో అమెరికా వెళ్లి, అసలైన విద్యను నిర్లక్ష్యం చేసి వీసాను ఇతర ప్రయోజనాల కోసం వాడుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇలాంటి దుర్వినియోగాలను అడ్డుకునేందుకు అమెరికా హోం భద్రతా శాఖ ఈ కొత్త హెచ్చరికను జారీ చేసింది. ప్రతీ ఏడాది సుమారు 2 లక్షల భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య కోసం యూఎస్ వెళ్తున్నారు. వీరిలో చాలామంది తొలిసారిగా విదేశీ జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఈక్రమంలోనే కొందరు జల్సాలకు అలవాటు పడి తరగతులకు హాజరు కాకపోవడం లేదా మధ్యలో కోర్సును మానేయడం వంటివి చేస్తున్నారు. ఇవి మాత్రమే కాకుండా ఇతర పనులు చేస్తూ డబ్బులు సంపాదించేందుకు కూడా ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వాళ్లను ఆపేందుకు అమెరికా ఈ హెచ్చరిక చేయగా.. విద్యాసంస్థలు సైతం అప్రమత్తం అయ్యాయి. విద్యార్థులపై మరింత నిఘా పెడుతూ.. పలు సూచనలు కూడా చేస్తున్నాయి.

# దాన్ని అత్యాచార నేరంగా పరిగణించలేం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈమధ్య కాలంలో అమ్మాయిలు, అబ్బాయిలు పెళ్లిళ్ల చేసుకోకుండానే కాపురాలు పెట్టేస్తున్నారు. సహజీవనం పేరుతో కలిసి జీవిస్తున్నారు. అయితే కొన్నాళ్ల తర్వాత వీరి మధ్య విభేదాలు వస్తే.. కొందరు అమ్మాయిలు లైట్ తీస్కోగా, మరికొందరు మాత్రం తమను పెళ్లి చేసుకుంటామని మాయ మాటలు చెప్పి మోసం చేశారంటూ కోర్టులను, పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. అత్యాచారం కేసులు పెట్టి అబ్బాయిలకు చుక్కలు చూపిస్తున్నారు. అయితే ఇలాంటి వాళ్లకు షాక్ ఇస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పును ఇచ్చింది. ముఖ్యంగా ఇలాంటి కేసులు అత్యాచారం కేసు కిందకు రావంటూ, వీటిని ఆ కేసుల కింద అస్సలే పరిగణించలేమంటూ వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని సతారాకు చెందిన ఓ మహిళకు అప్పటికే పెళ్లి అయింది. కానీ మరో వ్యక్తితో ఆమె ప్రేమలో పడగా.. భర్తను వదిలేసి ప్రియుడి చెంత చేరింది. ముఖ్యంగా 2022 జులై నుంచి 2023 వరకు అతడితోనే సహజీవనం చేసింది. ఈ మధ్య కాలంలోనే భర్త కుల పెద్దలకు చెప్పి పంచాయితీ పెట్టించగా.. అతడితో విడాకులు తీసుకుంది. మరోవైపు ప్రేమికుడు కూడా ఆమెకు బ్రేకప్ చెప్పాడు. దీంతో సదరు మహిళ ప్రియుడిపై ట్రయల్ కోర్టులో ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను బలవంతంగా శారీరంగా వాడుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అయితే ఆమె ప్రియుడు మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చాడు. బలవంతంగా ఏమీ తాను మహిళతో బంధం సాగించలేదని.. ఇద్దరి ఇష్ట పూర్వకంగానే కలిసున్నామని చెప్పాడు.

అయితే 2023 ఆగస్టులో ట్రయల్ కోర్టు అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కేసు కొట్టి వేయాలని హైకోర్టును ఆశ్రయించగా.. తిరస్కరించడంతో సుప్రీం కోర్టులో అప్పీల్ దాఖలు చేశాడు. అయితే ముందుస్తు సమాచారం లేకుండా సదరు మహిళ అతడి సొంత గ్రామానికి వెళ్లటాన్ని కూడా ధర్మాసనం తప్పు పట్టింది. అతడు దూరమైపోతాడన్న బాధ, భయంతోనే ఆమె అత్యాచార ఆరోపణలు చేసినట్లుగా గుర్తించింది. 25 ఏళ్ల వయసు కల్గిన నిందితుడి జీవితాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పును ఇచ్చింది. పరస్పర అంగీకారంతో సహజీవనం చేసిన జంట ఆపై విడిపోవడం క్రిమినల్ కేసు దాఖలుకు కారణం కారాదని తేల్చి చెప్పింది. ఇలాంటి కేసులు న్యాయస్థానాలపై భారం మోపడమే కాకుండా, నిందితుల జీవితంపై కూడా తీరని మచ్చలుగా ఉండిపోతాయని జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యంగా పెళ్లి చేసుకుంటాననే మోసపూరిత వాగ్దానంతో మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ మహిళ చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ.. నిందితుడిని నిర్దోషిగా తేల్చింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఆరోపణలు నిజమే అయినప్పటికీ.. ఆమెకు ఇష్టం లేకుండా దీర్ఘకాలంగా అతడు ఆమెతో సహజీవనం చేసినట్లు భావించలేమని అభిప్రాయపడింది. ఇప్పటికే ఇలాంటి చాలా కేసులు వస్తున్నాయని.. చట్ట నిబంధనలు దుర్వినియోగం అవుతున్నాయని చాలా కాలంగా న్యాయస్థానం హెచ్చరిస్తూనే వస్తోంది.

# షాకింగ్ విషయాలు వెల్లడించిన సిరాజ్




**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో వెలుగుచూసిన ఐసిస్ ఉగ్ర పేలుళ్ల కుట్ర కేసులో అరెస్టైన నిందితులు సిరాజ్, సమీర్‌ల విచారణ కొనసాగుతోంది. విజయనగరం పోలీస్ ట్రెయినింగ్ అకాడమీలో నాలుగో రోజు అధికారులు వీరిని విచారించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఐబీ టీమ్, ఎన్ఐఏ, ఏటీఎస్, తెలుగు రాష్ట్రాల పోలీసులు విజయనగరంలో ఉగ్రవాద సానుభూతిపరులైన సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌లను విచారిస్తున్నారు. సిరాజ్, సమీర్‌ల నెట్‌వర్క్ దేశ, విదేశాలకు విస్తరించిందని, వారిద్దరూ కలిసి భారీ పేలుళ్లకు కుట్ర పన్నారని అనుమానిస్తున్నారు. ఈ కేసులో వరంగల్‌కు చెందిన మొహిద్దీన్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బాధల్, మరో ఆరుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. సిరాజ్, సమీర్‌లు సోషల్ మీడియాలో చేసిన చాటింగ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. . భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ ఈ ఉగ్రకుట్ర వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.

విచారణలో సిరాజ్ సంచలన విషయాలు వెల్లడించాడు. బాంబు పేలుళ్లకు తన మొదటి టార్గెట్ విజయనగరమేనని సిరాజ్ చెప్పాడు. అయితే, సౌదీ హ్యాండ్లర్ హైదరాబాద్‌లో పేలుళు జరపని చెప్పినా, తాను మాత్రం విజయనగరాన్నే ఎంచుకున్నట్లు తెలిపాడు. 'హైదరాబాద్‌లో పేలుళ్లు జరపాలని సౌదీ హ్యాండ్లర్ నాకు సూచించారు. కానీ, ప్రశాంతంగా ఉన్న విజయనగరమే నా లక్ష్యమని వాళ్లకు చెప్పాను' అని సిరాజ్ విచారణలో చెప్పాడు. పేలుళ్ల కోసం సౌదీలో శిక్షణ తీసుకున్నట్లు కూడా బయటపెట్టాడు. విజయనగరంలో నాలుగు ప్రాంతాలను పేలుళ్ల కోసం ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

నిందితులు విజయనగరంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పేలుళ్లకు ప్లాన్ చేశారని, ఐసిస్ లేదా ఇతర ఉగ్ర సంస్థలు వారిని ప్రోత్సహించాయని విచారణలో తేలింది. పోలీసులు వారి ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. సిరాజ్ కుటుంబం, స్నేహితుల గురించి వివరాలు సేకరిస్తున్నారు. సిరాజ్ ల్యాప్‌టాప్‌లో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తున్నారు. సిరాజ్, సమీర్ కలిసి.. అల్‌హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (అహీం) అనే సంస్థను స్థాపించారు. సౌదీ అరేబియా నుంచి ఐసిస్ హ్యాండ్లర్లు ఇచ్చే ఆదేశాలను ఎలా అమలు చేయాలి అనే దానిపై ఈ ముఠా చర్చలు జరిపింది. గత నవంబర్ 22న ముంబయిలో 10 మందితో కలిసి హక్ ఇండియా లైవ్ సెషన్‌లో పాల్గొన్నట్లు తెలిపాడు. అక్కడ ఎవరెవరిని కలిశాడు, పేలుడుకు సంబంధించిన ఏమైనా వస్తువులు తెచ్చాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 26న ఢిల్లీకి ఎందుకు వెళ్ళాడు, అక్కడ ఎవరిని కలిశాడు అని కూడా ప్రశ్నించారు.

బిహార్‌కు చెందిన అబూ తాలెం అలియాస్ అబూ ముసబ్ సూచనలతో సిరాజ్, సమీర్‌లు సిగ్నల్ యాప్ ద్వారా జిహాదీ కార్యక్రమాలను తెలుసుకునేవారని తెలిసింది. జిహాదీలకు సంబంధించిన విషయాలు తెలుసుకోవడానికి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి. వాటి ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకొని ఆ వైపు ఆకర్షితులయ్యారని విచారణలో ఒప్పుకున్నారు. సిరాజ్‌కు గోషామహల్ ఎమ్మెల్యేపై కోపం ఉందని, అందుకే ఆయన వీడియోలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని చెప్పాడు. ఆ పోస్టులను చూసి విశాఖలోని ఒక ప్రభుత్వ ఉద్యోగి తనను మెచ్చుకున్నాడని కూడా చెప్పాడు. ఆయన ఓ రెవెన్యూ అధికారి అని తెలుస్తోంది. ఆ అజ్ఞాత వ్యక్తి ఎవరు? అనేది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. సిరాజ్, సమీర్ ఆరోగ్య పరిస్థితిని అధికారులు గమనిస్తున్నారు. వైద్యులు పరీక్షించిన తర్వాతే వారికి ఆహారం ఇస్తున్నారు. పోలీసులు అన్ని విషయాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. మరోవైపు, సమీర్ కూడా విచారణలో విస్మయానికి గురిచేసే వాస్తవాలను వెల్లడించాడని సమాచారం. అతడు, పాకిస్థాన్‌లో శిక్షణ తీసుకున్నట్లు అంగీకరించాడు.

# ఐదో జనరేషన్ యుద్ధ విమానం అమ్కా తయారీకి రక్షణశాఖ ఆమోదం




**న్యూఢిల్లీ-నవభూమి:**రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా రక్షణ శాఖ కీలక ప్రకటన చేసింది. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ల తయారీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. ఇతర సంస్థల భాగస్వామ్యంతో బెంగళూరులోని డీఆర్‌డీవో -ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ దీనిని అమలు చేయనుంది. అమ్కా ను రూపొందించడంలో ఈ ప్రక్రియ కీలక మైలురాయిగా నిలువనుంది. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఐదో తరం యుద్ధ విమానం అడ్వాన్స్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ నమూనాను తొలిసారి 'ఏరో ఇండియా-2025'లో ప్రపంచానికి చూపించారు. కృత్రిమ మేధ ఆధారిత ఎలక్ట్రానిక్ పైలట్, నెట్ ఆధారిత ఆయుధ వ్యవస్థల లాంటి ప్రత్యేకతలు ఈ విమానం సొంతం. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా సత్తా చాటుతుంది. 25 టన్నుల బరువుండే ఈ లోహ విహంగాన్ని మానవ సహితంగా, మానవ రహితంగా పనిచేసేలా రూపొందించనున్నారు. ఏడీఏ ఈ యుద్ధ విమానం డిజైన్‌ను రూపొందించింది. హైదరాబాద్‌కు చెందిన వేమ్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ ఫ్యాబ్రికేషన్ పనులు చేసింది.

## ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు..!



ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేల పై బహిష్కరణ వేటు పడింది. పార్టీ నియమాలను ఉల్లంఘించారనే కారణంతో బీజేపీ వారిపై వేటు వేసింది. కర్ణాటక కు చెందిన ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఎస్టీ సోమశేఖర్ ఎ శివరామ్ హెబ్బర్ ఆరేసి ఏళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన కేంద్ర క్రమశిక్షణ కమిటీ తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఇవాళ్టి వరకు వాళ్లు పార్టీకి సంబంధించిన ఏ పదవిలో ఉన్నా ఆ పదవులన్నింటి నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది మార్చి 25న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకు పార్టీ షాకాజ్ నోటీసులు ఇచ్చిందని, ఆ నోటీసులకు వారు సమాధానాలు ఇచ్చారని, వారిచ్చిన సమాధానాలను పరిగణలోకి తీసుకునే ఇప్పుడు వారిపై బహిష్కరణ వేటు వేశామని బీజేపీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ తెలిపింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంగా వారు పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేశారని, దానిపై షాకాజ్ నోటీసు ఇచ్చినా వారి నుంచి సరైన సమాధానం రాలేదని, అందుకే ఆ ఇద్దరిపై బహిష్కరణ వేటు వేశామని పేర్కొంది.

## ఢిల్లీ పోలీసుల అదుపులో 88 మంది బంగ్లాదేశీ అక్రమ వలసదారులు




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీ వలసదారుల ఏరివేతే లక్ష్యంగా సౌత్ వెస్ట్ జిల్లా లో గత 10 రోజులుగా వెరిఫికేషన్ డ్రైవ్ కొనసాగుతోంది. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు ఢిల్లీలో అక్రమంగా ఉంటున్న 88 మంది బంగ్లాదేశీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర ఉన్న బంగ్లాదేశీ గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వాళ్లను తిరిగి వాళ్ల దేశానికి పంపించేందుకు కావాల్సిన ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఈ 88 మందితో కలిపి 2024 డిసెంబర్ 26 నుంచి ఇప్పటివరకు సౌత్ వెస్ట్ జిల్లాలో పోలీసులు అదుపులోకి తీసుకున్న బంగ్లాదేశీ అక్రమ వలసదారుల సంఖ్య 142కు చేరింది. ఈ విషయాన్ని ఢిల్లీ పోలీసులు మీడియాకు వెల్లడించారు.

## ఐపీఎల్ టికెట్ల వ్యవహారం.. విజిలెన్స్ సంచలన నివేదిక!

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** వివాదాస్పదంగా మారిన ఐపీఎల్-2025 టికెట్ల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ ముగిసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాలపై విచారణ పూర్తి చేసిన విజిలెన్స్.. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీపై హెచ్‌సీఏ సెక్రెటరీ ఒత్తిడి తీసుకొచ్చినట్లు నివేదికలో విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. టికెట్ల కోసం ఎస్‌ఆర్‌హెచ్ యజమాన్యాన్ని ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. కాగా, ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ మ్యాచులకు సంబంధించి 10 శాతం టికెట్లను ఫ్రాంచైజీ ఫ్రీగా ఇచ్చింది. అయినా అదనంగా మరో 10 శాతం టికెట్లు కావాలని యాజమాన్యంపై హెచ్‌సీఏ సెక్రెటరీ ఒత్తిడి తీసుకురావడంతో వివాదం మొదలైంది.

ఆల్రెడీ 10 శాతం టికెట్లు ఇస్తున్నందున, అదనంగా మరో పది శాతం టికెట్లు ఇచ్చే ప్రసక్తి లేదని హెచ్‌సీఏకు సన్‌రైజర్స్ యాజమాన్యం తేల్చిచెప్పింది. అయితే ఓపెన్ మార్కెట్లో టికెట్లు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెట్టడంతో టికెట్లు ఇచ్చేందుకు సన్‌రైజర్స్ ఒప్పుకుంది. అయినా వ్యక్తిగతంగా తనకు మరో 10 శాతం టికెట్లు కావాలని ఎస్‌ఆర్‌హెచ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే వ్యక్తిగతంగా టికెట్లు ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చిచెప్పింది సన్‌రైజర్స్ యాజమాన్యం. టికెట్లు ఇవ్వలేదనే కారణంతో మ్యాచుల సందర్భంగా ఎస్‌ఆర్‌హెచ్‌ను జగన్మోహన్ ఇబ్బందులకు గురిచేయడంతో ఈ వివాదం తారస్థాయికి చేరుకుంది. లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీలకు హెచ్‌సీఏ సిబ్బంది తాళాలు వేశారు. తీవ్ర దుమారం రేపిన ఈ వివాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. దీనిపై విచారణకు విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. విచారణ పూర్తవడంతో తాజాగా సర్కారుకు నివేదికను అందించారు. ఎస్‌ఆర్‌హెచ్‌ను హెచ్‌సీఏ తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లుగా నివేదికలో తెలిపారు. అంతేగాక హెచ్‌సీఏ మీద చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.







# పాక్ ఆర్మీ పోస్టులపై విరుచుకుపడిన భారత బలగాలు..

**జమ్మూ-నవభూమి:** 'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా పాకిస్థాన్ భూభాగంలోకి భారత బలగాలు చొచ్చుకెళ్లి ఉగ్రవాద శిబిరాలపై ఏవిధంగా విరుచుకుపడ్డాయో వివరించే కొత్త వీడియోను సరిహద్దు భద్రతా దళం విడుదల చేసింది. మంగళవారంనాడిక్కడ జమ్మూ బీఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వీడియోను అధికారులు విడుదల చేశారు.సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని 2.2 కిలోమీటర్ల లోపలకు చొచ్చుకుపోయి ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడటం, అత్యంత శక్తివంతంగా ఈ దాడులు జరగడంతో పాకిస్థాన్ రేంజర్లు కకావికలై పరుగులు తీయడం ఈ వీడియోలో కనిపిస్తోంది. ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడంతో పాటు సరిహద్దుల వెంబడి పాకిస్థాన్ ఆర్మీ పోస్టులను విధ్వంసం చేయడం కూడా వీడియోలో ఉంది.

పక్కా ప్లాన్‌తోనే..పాకిస్థాన్ క్రాస్-బోర్డర్ షెల్లింగ్‌ను సమర్ధవంతంగా తాము తిప్పికొట్టినట్టు బీఎస్ఎస్ అధికారులు తెలిపారు. మే 9,10 తేదీల్లో కూడా ఎల్ఓసీ వెంబడి ఉగ్రస్థావరాలపై దాడులకు ప్లాన్ చేశామని జమ్మూ ఫ్రాంటియర్ బీఎస్ఎఫ్ ఐజీ శశాంక్ ఆనంద్ తెలిపారు. పాకిస్థాన్ క్రాస్ బోర్డర్ ఫైరింగ్ జరపడంతో ముందుగానే సన్నద్ధంగా ఉన్న తమ బలగాలు అనేక పాక్ పోస్టులపై విరుచుకుపడి భారీగా నష్టపరిచాయని, ఈ దాడుల్లో తమకెలాంటి నష్టం జరగలేదని చెప్పారు. ఆపరేషన్‌లో భాగంగా ఎల్ఓసీ సమీపంలోని లూనిలో లష్కరే తొయిబా ఉగ్రవాద శిబిరంపై మే 9-10వ తేదీల మధ్య రాత్రి పక్కా ప్లాన్‌తో దాడిచేశామని, ఈ ఉగ్రవాద శిబిరం అంతర్జాతీయ సరిహద్దు నుంచి పాకిస్థాన్‌కు 3 కిలోమీటర్ల దూరంలో ఉందని వివరించారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5
హైదరాబాద్
బుధవారం
28 . మే . 2025


# పోలీసుల ఎదుట లొంగిపోయిన 18 మంది మావోయిస్టులు



**ఛత్తీస్‌గఢ్-నవభూమి:** రాష్ట్రం లోని సుక్మా జిల్లా లో పోలీసుల ఎదుట 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏబెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. వారిలో 10 మందిపై కలిపి మొత్తం రూ.38 లక్షల రివార్డు ఉంది.సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు ఆ 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నక్సల్ రహిత గ్రామ పంచాయతీ పథకం కింద సాధించిన విజయంగా దీన్ని ఎస్పీ పేర్కొన్నారు. కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పెద్దఎత్తున మావోయిస్టులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ నేపథ్యంలో వీరు లొంగిపోయినట్లు తెలుస్తోంది.

# వారందరికీ కేంద్రం గుడ్‌న్యూస్.. డబ్బులు పెంపు




**న్యూఢిల్లీ-నవభూమి:**కేంద్ర నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి జయంత్ చౌదరి అధ్యక్షతన సోమవారం కేంద్ర అప్రెంటీస్‌షిప్ కౌన్సిల్ భేటీ అయింది. ఈ సమావేశంలో అప్రెంటీస్‌లకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ సమావేశంలో అప్రెంటీస్‌లకు ఇచ్చే నెలవారీ స్టైఫండ్‌ను భారీగా పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ 2 పథకాల కింద ఇప్పుడు ఇస్తున్న స్టైఫండ్‌ను పెంచాలని నిర్ణయించింది. రూ.5 వేల నుంచి రూ.9 వేల వరకు ఉన్న స్టైఫండ్‌ను కాస్తా.. రూ.6,800 నుంచి రూ.12,300 వరకు పెంచాలని సంబంధిత మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్ వంటి కొత్త రంగాల్లో అప్రెంటీస్‌షిప్‌లను ప్రోత్సహించడం, పరిశ్రమల పరిధిని మరింత విస్తరించడం, డిగ్రీ అప్రెంటీస్‌షిప్ ప్రవేశపెట్టడం, వికలాంగులకు అవకాశాలు కల్పించడం వంటి అనేక కీలక నిర్ణయాలకు ఈ సమావేశంలో ఆమోదం కల్పించారు.ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (పీఎం ఎన్ఏపీఎస్) కింద కేంద్ర ప్రభుత్వ సహకారం ప్రకారం.. రూ.1,500 లేదా స్టైఫండ్ మొత్తంలో 25 శాతం ఉంటుంది. నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎన్ఏటీఎస్) కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం స్టైఫండ్ మొత్తాన్ని భరిస్తుంది. ఈ స్టైఫండ్ పెంపు అనేది.. నోటిఫై అయిన తర్వాత అమల్లోకి రానుంది. అయితే ఈ స్టైఫండ్ పెంపు వినియోగదారుల ధరల సూచికలో మార్పుల ఆధారంగా ప్రతి 2 ఏళ్లకు ఒకసారి ఆటోమేటిక్‌గా సర్దుబాటు చేయబడుతుంది.అదే సమయంలో ఈ భేటీలో ఏఐ, గ్రీన్ టెక్ వంటి కొత్త రంగాల్లో ఆన్‌లైన్, వర్చువల్ లేదా బ్లెండెడ్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్‌ల సామర్థ్యంపైనా సంబంధిత అధికారులు చర్చించారు. అప్రెంటీస్‌షిప్ శిక్షణ పరిధిని ఐటీ, సాఫ్ట్‌వేర్ సేవలు, టెలికమ్యూనికేషన్స్, బయోటెక్నాలజీ, పునరుత్పాదక శక్తి వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలను చేర్చడానికి విస్తరించారు. అప్రెంటీస్‌షిప్ ఎంబెడెడ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించడం.. డిగ్రీ అప్రెంటీస్‌షిప్ వంటి కొత్త వాటిని ప్రవేశపెట్టడం వంటివి అజెండాలో చేర్చారు.ప్రాథమిక, ప్రాక్టికల్ శిక్షణను ఆన్‌లైన్, వర్చువల్ లేదా బ్లెండెడ్ పద్ధతుల్లో అందించడానికి సంబంధిత ఓనర్లకు అనుమతి ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వ అప్రెంటీస్‌షిప్ స్కీమ్ నిర్వహణను మెరుగుపరచడానికి ప్రాంతీయ బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే వికలాంగులకు అప్రెంటీస్‌షిప్ శిక్షణలో సమాన అవకాశాలు కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రపంచంలోనే అతిపెద్ద అప్రెంటీస్‌షిప్ కార్యక్రమాన్ని భారతదేశం నడుపుతోందని.. కేంద్రమంత్రి జయంత్ చౌదరి వివరించారు. ఇది యువతకు పరిశ్రమతో అనుబంధాన్ని ఏర్పరుచుకోవడానికి, ఉపాధి పొందడానికి స్పష్టమైన మార్గాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. చివరి కేంద్ర అప్రెంటీస్‌షిప్ కౌన్సిల్ సమావేశం 2021 జూన్‌లో జరగ్గా.. అప్పటి నుంచి దేశంలో అప్రెంటీస్‌షిప్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందింది.

# 20 కోట్ల అప్పు తీర్చలేక.. కారులో 7 మంది బలవన్మరణం!



**పంచకుల-నవభూమి:** హర్యానా లోని పంచకు లలో ఏడు మంది విషం తాగి కారులో బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ప్రవీణ్ మిట్టల్ అనే వ్యక్తికి చెందిన కుటుంబం ప్రాణాలు కోల్పోయింది. అయితే ఆ ఫ్యామిలీ సుమారు 20 కోట్ల అప్పు చేసినట్లు తెలుస్తోంది. ప్రవీణ్ మిట్టల్‌తో పాటు ఆయన భార్య, పేరెంట్స్, ముగ్గురు పిల్లలు కారులో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారు. సూసైడ్ నోట్ రాసి వదిలినట్లు గుర్తించారు. అంత్యక్రియలను సందీప్ అగర్వాల్ నిర్వహించాలని కోరుతూ ఆ నోట్‌లో తెలిపారు. అయిదు రోజుల క్రితం ఆ వ్యక్తితో ప్రవీణ్ మిట్టల్ ఫోన్‌లో మాట్లాడినట్లు తేల్చారు.వివరాల్లోకి వెళ్తే.. ప్రవీణ్ మిట్టల్ కొన్నేళ్ల క్రితం హిమాచల్ ప్రదేశ్‌లోని బద్దిలో చెత్త ఫ్యాక్టరీ పెట్టాడు. రుణం తీర్చని కారణంగా ఆ షాపును బ్యాంకు వాళ్లు కొన్నాళ్లకు సీజ్ చేశారు. తీవ్రమైన అప్పుల్లోకి వెళ్లిన మిట్టల్.. పంచకుల నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లాడు. ఆరేళ్ల పాటు కుటుంబానికి దూరంగా ఉన్నాడు. ఇంటి నుంచి వెళ్లిపోయిన టైంలో మిట్టల్‌కు 20 కోట్ల అప్పు ఉన్నట్లు సందీప్ అగర్వాల్ చెప్పాడు.కొన్నాళు పంజాబ్‌లోని ఖరార్‌కు మకాం మార్చాడు. ఆ తర్వాత హర్యానాలోని పింజోర్‌కు వెళ్లాడు. నెల క్రితమే అతను పంచకులకు మళ్లీ వచ్చినట్లు తెలుస్తోంది. మిట్టల్ సొంత పట్టణం హిసార్‌లోని బర్వాలా. కొన్నాళ్ల నుంచి పంచకులలోని సాకేత్రి ప్రాంతంలో ట్యాక్సీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. అతని వద్ద ఉన్న రెండు ఫ్లాట్లు, వాహనాలను ఇటీవల బ్యాంక్ సీజ్ చేసింది.డెహ్రాడూల్‌లో ఉంటున్న మిట్టల్ ఫ్యామిలీ.. సోమవారం భగేశ్వర్ ధామ్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లారు. ఆ ఈవెంట్‌కు హాజరై ఇంటికి వస్తున్న సమయంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

# దేశంలో పెరుగుతున్న కొవిడ్ కేసులు



**న్యూఢిల్లీ-నవభూమి:**గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో కేంద్రంతోపాటు అన్ని రాష్ట్రాలు అలర్ట్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఇన్ఫెక్షన్ల తీవ్రత సాధారణంగానే, తేలికపాటిదిగానే ఉందని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహ్ల్ సోమవారం స్పష్టం చేశారు. దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. వైరస్ నమూనాల జీనోమ్ సీక్వెన్సింగ్ కొత్త వేరియంట్లు తీవ్రమైనవి కావని.. అవి ఒమిక్రాన్ సబ్ వేరియంట్లేనని చూపించినట్లు తెలిపారు. ఈ వేరియంట్లు ఎల్ఎఫ్ 7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్ 1, ఎన్‌బీ.1.8.1 అని.. వీటిలో మొదటి 3 ఎక్కువగా వ్యాప్తి ఉన్నాయని డాక్టర్ రాజీవ్ బెహ్ల్ వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి నమూనాలను సీక్వెన్స్ చేస్తున్నారని.. ఒకట్రెండు రోజుల్లో మరిన్ని వేరియంట్లు ఉన్నాయో లేదో తెలుస్తుందని తెలిపారు.ఐసీఎంఆర్ డీజీ వెల్లడించిన వివరాల ప్రకారం.. కేసుల సంఖ్య తొలుత దక్షిణం నుంచి.. ఆపై పశ్చిమం నుంచి మరియు ఇప్పుడు ఉత్తర భారత్ నుంచి పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కేసులన్నీ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ద్వారా పర్యవేక్షించబడుతున్నాయని వివరించారు. అదనంగా దేశవ్యాప్తంగా ఐఎంసీఆర్ ఆధ్వర్యంలోని శ్వాసకోశ వైరస్ సెంటినెల్ సర్వైలెన్స్ నెట్‌వర్క్.. కొత్తగా వస్తున్న ఇన్ఫెక్షన్లు, వ్యాధికారకాలను పర్యవేక్షిస్తోందని తెలిపారు. కరోనా కేసులు పెరిగినప్పుడు.. 3 విషయాలను పరీక్షిస్తామని డాక్టర్ రాజీవ్ బెహ్ల్ చేశారు. ఇది ఎంత వేగంగా వ్యాపిస్తుంది.. అంటే కేసులు ఎంత వేగంగా పెరుగుతున్నాయి అనేది మొదటి అంశమని.. గతంలో కొవిడ్ కేసులు 2 రోజుల్లో రెట్టింపు కావడం చూశామని.. కానీ ఈసారి కేసులు అంత వేగంగా పెరగడం లేదని అన్నారు.కొత్తగా వ్యాప్తి చెందుతున్న కొవిడ్ వేరియంట్లు గత రోగనిరోధక శక్తిని తప్పించుకుంటున్నాయా అనే ప్రశ్నకు ఐసీఎంఆర్ డీజీ స్పందించారు. కొత్త వేరియంట్లు వచ్చినప్పుడు, అవి సహజ రోగనిరోధక శక్తి లేదా వ్యాక్సిన్ నుంచి వచ్చిన రోగనిరోధక శక్తిని తప్పించుకుంటాయని.. కానీ ప్రస్తుతానికి ఇలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మూడో అంశం ఏంటంటే కొవిడ్ కేసుల్లో తీవ్రమైన కేసుల శాతమని ఆయన అన్నారు. ప్రస్తుతానికి తీవ్రత సాధారణంగా తక్కువగా ఉందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. మనం అప్రమత్తంగా ఉండాలని.. ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని డాక్టర్ బెహ్ల్ వెల్లడించారు.ఆదివారం కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశానికి తాను, ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ హాజరైనట్లు డాక్టర్ బెహ్ల్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని.. అప్రమత్తంగా ఉండాలి కానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. సాధారణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ప్రస్తుతానికి అలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. డబ్ల్యూహెచ్ఓ డేటాబేస్ కొత్త వేరియంట్లు తీవ్రమైన వ్యాధిని కలిగించడం లేదని చూపుతుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని.. సాధారణ జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు.బూస్టర్ డోస్ వేసుకోవాల్సిన అవసరం ఉందా ఐసీఎంఆర్ డీజీని అడగ్గా.. ప్రస్తుతానికి టీకా అవసరం లేదని తేల్చి చెప్పారు. భారత్‌కు టీకాలు తయారుచేసే సామర్థ్యం ఉందని.. అవసరమైతే అతి తక్కువ సమయంలో ఏదైనా టీకాను తయారుచేయగలమని వెల్లడించారు. మే నెల నాటికి.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎల్ఎఫ్ 7, ఎన్‌బీ.1.8 సబ్-వేరియంట్‌లను "వేరియంట్స్ అండర్ మానిటరింగ్" (పరిశీలనలో ఉన్న వేరియంట్లు)గా వర్గీకరించింది. "వేరియంట్స్ ఆఫ్ కన్సర్న్" (ఆందోళన కలిగించే వేరియంట్లు) లేదా "వేరియంట్స్ ఆఫ్ ఇంటరెస్ట్" (ఆసక్తి కలిగించే వేరియంట్లు)గా కాదని వెల్లడించింది. చైనా, ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో కొవిడ్ కేసులు పెరగడానికి ఈ వేరియంట్‌లే కారణమని తెలిపింది.

# పహల్గాంలో క్యాబినెట్ మీట్.. ఉగ్రదాడిని ఖండిస్తూ ఒమర్ పోస్ట్



**జమ్మూ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి యావద్దేశాన్ని కుదిపేసింది. 26 మంది టూరిస్టులను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమానుషంగా కాల్చిచంపిన ఘటనను కేంద్రం, జమ్మూకశ్మీర్ ప్రభుత్వంతో సహా యావద్దేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదుల చర్యకు ప్రతిగా ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లోని ఉగ్ర సంస్థలు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌కు భారత బలగాలు గట్టి గుణపాఠం చెప్పాయి. ఈ క్రమంలో ఉగ్రవాదుల పిరికిపంద చర్యలను ఏమాత్రం ఖాతరు చేసేదిలేదనే సందేశాన్ని పంపుతూ ఘటన జరిగిన ప్రాంతంలోనే జమ్మూకశ్మీర్ ప్రభుత్వం మంగళవారంనాడు ప్రత్యేక క్యాబినెట్ సమావేశం జరిపింది. వేసవి రాజధాని శ్రీనగర్, శీతాకాల రాజధాని జమ్మూకు వెలుపల తొలిసారి పహల్గాం కన్వెన్షన్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ మంత్రివర్గ సమావేశం జరిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన వెల్లడించారు.కశ్మీర్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పర్యాటక రంగంపై పహల్గాం ఉగ్రదాడి ప్రభావం తీవ్రంగా పడింది. ఈ నేపథ్యంలో పర్యాటకంపై ఆధారపడిన ప్రజలకు సంఘీభావంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ఒమర్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.పర్యాటకం తమకు ప్రధాన ఆర్థిక వనరుగా ఉందని, యావత్ ప్రపంచాన్ని జమ్మూకశ్మీర్ పర్యాటకం వైపు ఆకర్షించాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. ఇందుకోసం ఎంతో అప్రమత్తతతో తగిన చర్యలు తీసుకుంటున్నామని, కశ్మీర్ లోయలో సాధ్యమైనంత త్వరలో తిరిగి పర్యాటకుల రాకపోకలు పునరుద్ధరించాలని అనుకుంటున్నామని తెలిపారు. గత ఐదారు వారాలుగా దేశం క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొందని, జమ్మూకశ్మీర్ భారీ మూల్యం చెల్లించుకుందని చెప్పారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అవసరమైన అన్ని చర్యలు తమ ప్రభుత్వం తీసుకుంటోందని అన్నారు. ఉగ్రవాదుల పరికిపంద చర్యలకు భయపడేది లేదని స్పష్టంగా చెప్పేందుకు తాము ఇక్కడకు వచ్చామని తెలిపారు.


# పాక్‌లో 2.2 కిలోమీటర్ల దూరం చొచ్చుకెళ్లి దాడులు..

## భారత్ దెబ్బకు పారిపోయిన పాక్ రేంజర్లు



**శ్రీనగర్-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను త్రివిధ దళాలు సమన్వయంతో ధ్వంసం చేశాయి. కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించి ఉగ్రమూకల పనిపట్టాయి. ఇక ఆపరేషన్‌కు సంబంధించిన దృశ్యాలను మన బలగాలు గత కొన్ని రోజులుగా ఎక్స్ వేదికగా షేర్ చేస్తున్నాయి. తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ శత్రు దేశాలకు స్ట్రాంగ్ మెసేజ్ ఇస్తున్నాయి.ఆపరేషన్ సిందూర్ వివరాలను వివరిస్తూ.. తాజాగా బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కూడా ఆ తరహా వీడియోని పంచుకుంది. అందులో మూడు టెర్రర్ లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసినట్లు చూపించింది. ఈ మేరకు పాక్‌లో 2.2 కిలోమీటర్ల దూరం చొచ్చుకెళ్లి ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు ఖచ్చితమైన దాడులను నిర్వహించారు. పాక్ ఆర్మీ పోస్టులపై కూడా దాడి చేసి ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను జమ్ము ఫ్రాంటియర్‌లోని బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శశాంక్ ఆనంద్ మీడియా సమావేశంలో ప్రదర్శించారు.'మే 9, 10 తేదీల మధ్య రాత్రి సరిహద్దు సమీపంలో లష్కరే తోయిబాకు చెందిన లూని ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ను నాశనం చేశాం. ఆర్ఎస్ పురా సెక్టార్‌కు ఎదురుగా ఉన్న మస్తపూర్ అనే మరో లాంచ్‌ప్యాడ్‌ను కూడా ధ్వంసం చేశాం. భారత దళాల దాడులతో పాక్ రేంజర్లు అక్కడి నుంచి పారిపోయారు అని జమ్ము ఫ్రాంటియర్‌లోని బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శశాంక్ ఆనంద్ అన్నారు. 'సరిహద్దుల్లో మన భద్రతా దళాలు పూర్తి ఆధిపత్యం చెలాయించాయి. శత్రువుకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి' అని పేర్కొన్నారు.

# ఆ రోజున వార్ రూమ్‌లో ఏం జరిగింది?




**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత సైన్యం.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న త్రివిధ దళాధిపతుల ఫోటోలను ఒక పుస్తక రూపంలో విడుదల చేసింది. ఈ ఫోటోల్లో ఆర్మీ, నౌకా దళం, వాయుసేన చీఫ్‌లు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ డీకే త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వార్ రూమ్‌లో ఉగ్రవాద స్థావరాలపై జరిగిన దాడులను నేరుగా పర్యవేక్షిస్తున్నారు.రెండో ఫోటోలో జనరల్ ద్వివేది, మరో సీనియర్ ఆర్మీ అధికారి మే 7 తెల్లవారుజామున 1:05కి స్క్రీన్‌ను తిలకిస్తూ కనిపిస్తారు. అదే సమయంలో ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైంది. వారు డ్రోన్ వీడియోలు, ఉపగ్రహ ఫోటోల ద్వారా జరిగిన దాడులపై ప్రత్యక్ష సమాచారం తెలుసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో భారత యుద్ధ విమానాలు, స్కాల్ప్ క్రూయిజ్ మిసైళ్లు, డ్రోన్‌లు ఉపయోగించి తొమ్మిది లక్ష్యాలపై దాడులు చేయగా, 170 మంది పైగా ఉగ్రవాదులు హతమయ్యారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణ**

భారత త్రివిధ దళాధిపతులు డ్రోన్, ఉపగ్రహ ఫోటోల ద్వారా దాడులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మే 7న పహల్గామ్ వద్ద బైసరన్ లోయలో ఉగ్రవాదులు 26 మంది పౌరులను హత్య చేసిన ఘటనకు ప్రతీకారం గానే ఈ దాడులు జరిగాయి. ఈ దాడులకు 'ఆపరేషన్ సిందూర్' అనే పేరు సూచించారు.ముష్కరుల కాల్పుల్లో భర్తలను కోల్పోయిన ఆడపడుచుల సింధూరానికి నివాళిగా ఆపరేషన్ సిందూర్ అనే పేరు పెట్టారు. భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం వాటిల్లింది.

ఉగ్రవాద శిబిరాలపై దాడులు

భారత సైన్యం దాడిలో పాకిస్థాన్‌లోని లష్కరే తొయిబా జైషే మహమ్మద్ , హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర సంస్థల ప్రధాన మౌలిక సదుపాయాలు, శిక్షణా శిబిరాలు, కార్యకలాప కేంద్రాలు ధ్వంసమయ్యాయి. బహావల్పూర్, మురీద్కే, సియాల్కోట్, చకామ్రూ, కోట్లీ, భింబర్, గుల్పూర్, ముజఫరాబాద్‌లోని రెండు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. వీటిలో మురీద్కే, హఫీజ్ సయీద్ నిర్వహించే లష్కరే తొయిబా ప్రధాన కార్యాలయం కాగా, బహావల్పూర్, మసూద్ అజహర్ నేతృత్వంలోని జైషే మహమ్మద్ స్థావరం ఒకటి.

100 గంటల రాకెట్, డ్రోన్ యుద్ధం

భారత దాడులను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్, రాజౌరీ తదితర ప్రాంతాల్లో షెల్లింగులు, డ్రోన్ దాడులకు పాల్పడింది. అప్పటి నుంచి మూడు రోజులు డ్రోన్, క్షిపణులతో భారత మిలిటరీ స్థావరాలు, నగరాలపై దాడులకు ప్రయత్నించింది. అయితే, వీటిని భారత సైన్యం దీటుగా ఎదుర్కొని, దాయాది కుట్రలను చిత్తుచేసింది.

భారత వైమానిక రక్షణ వ్యవస్థ విజయం

భారత మల్టీ-లేయర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ నగరాలను, మిలిటరీ స్థావరాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ వ్యవస్థలో %జ-ఖూూ, ా%70 గన్స్, %గ్రాఖ% 23 శిల్కా, మాన్ పోర్టబుల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు మొదటి లేయర్‌లో.. స్పైడర్, పెచోరా, %బూూా-ూఖ% వంటి షార్ట్ రేంజ్ సిస్టమ్స్ రెండో లేయర్‌లో ఉన్నాయి. మీడియం రేంజ్ సమ్‌లు ఆకాష్, ఇండో-ఇజ్రాయేలీ %వీ=ూూవీ% మూడో లేయర్‌లోనూ.. ఎస్-400, యుద్ధ విమానాలు నాలుగో లేయర్‌లోనూ ఉన్నాయి.

**పాక్ ఎయిర్ బేస్‌లపై దాడులు**

పాక్ సైన్యం దాడులను అడ్డుకున్న ఇండియన్ ఆర్మీ.. ప్రతిస్పందనంగా దాని ఎయిర్ బేస్‌లపై దాడులు జరిపింది. సర్గోధా, నూర్ ఖాన్ (చక్లాలా), భోలారి, జేకోబాబాద్, సుక్కూర్, రహీం యార్ ఖాన్, స్కార్దు, పస్రూర్, మురీద్, రఫీకీ, చునియన్ ప్రాంతాల్లో క్రూయిజ్ మిసైళ్లు, ప్రిసిషన్ బాంబులు, డ్రోన్‌లతో దాడులు నిర్వహించాయి. మే 8న లాహోర్‌లోని పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ లాంచర్‌పై డ్రోన్ దాడి జరిపారు. ఈ దాడుల్లో ఉపగ్రహ సమాచారం ప్రకారం.. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన సర్గోధా, నూర్ ఖాన్, భోలారి, జేకోబాబాద్, సుక్కూర్, రహీం యార్ ఖాన్ లాంటి బేస్‌లకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఆపరేషన్ సిందూర్ అనంతరం జాతికి ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన తొలి ప్రసంగంలో భారత భద్రతా విధానాల్లో వచ్చిన ప్రామాణిక మార్పును వివరించారు. భవిష్యత్తులో పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీద మాత్రమే జరుగుతాయని స్పష్టం చేశారు. "న్యూక్లియర్ బ్లాక్‌మెయిల్"ను భారత్ ఏమాత్రం సహించదని ఆయన హెచ్చరించారు.

పాక్ ప్రభుత్వం, ఆర్మీ, ఉగ్రవాద సంస్థల మధ్య ఉన్న సంబంధాలను బయటపెట్టారు. బహావల్పూర్, మురీద్కే ప్రపంచ ఉగ్రవాద యూనివర్సిటీలుగా మారిపోయాయని పేర్కొన్నారు. 9/11 దాడులు, లండన్ ట్యూబ్ బాంబింగ్, భారత్‌పై గత దశాబ్దంలో జరిగిన ప్రతి దాడికి వీటితో సంబంధం ఉందని చెప్పారు.


# అమృత్‌సర్‌లో బాంబు పేలుడు.. బబ్బర్ ఖల్సా ఉగ్రవాది మృతి

**చండీగఢ్-నవభూమి:** పంజాబ్ లోని అమృత్‌సర్ లో మంగళవారంనాడు బాంబు పేలుడు ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. నగరంలోని మజితా బైపాస్ రోడ్డులో ఒక వ్యక్తి బాంబును వెలికితీస్తుండగా అది చేతిలో పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడని, ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయాడని అమృత్‌సర్ రూరల్ ఎస్ఎస్‌పీ మణిందర్ సింగ్ తెలిపారు. బాంబును తప్పుగా ఆపరేట్ చేయడం వల్ల పేలి ఉండవచ్చని, మృతి చెందిన వ్యక్తికి ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉండవచ్చని భావిస్తున్నామని చెప్పారు.భారీ శబ్దంతో బాంబు పేలడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, బాంబు స్క్వాడ్ ఘటనా స్థలికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలిలోని ఆధారాలను సేకరిస్తోంది.ఈ సంఘటనపై బోర్డర్ రేంజ్ డీజీపీ సతీందర్ సింగ్ మాట్లాడుతూ, బాంబు పేలుడులో మరణించిన వ్యక్తిని ఉగ్రవాద సంస్థకు చెందిన వానిగా అనుమానిస్తున్నామని చెప్పారు. పేలుడు పదార్థాన్ని తనతో తీసుకు వెళ్లేందుకే అతను ఇక్కడకు వచ్చాడని అన్నారు. సహజంగా ఇలాంటి నిర్జన ప్రదేశాల్లోనే దేశవ్యతిరేక శక్తులు బాంబులు సరఫరా చేస్తుంటాయని, వేరెవరో వచ్చి వాటిని కలెక్ట్ చేసుకుని ఉగ్రఘటనలకు పాల్పడుతుంటారని చెప్పారు. గతంలో తాము ఇన్వెస్టిగేషన్ చేసిన కేసుల్లో ఈ విషయం తేలిందన్నారు.


# చరిత్ర సృష్టించిన నేపాలీ షెర్పా.. ఎవరెస్టు శిఖరాన్ని 31వ సారి ఎక్కిన కామి రిటా

**కాఠ్మాండు-నవభూమి:** నేపాలీ షెర్పా, ప్రఖ్యాత పర్వతారోహకుడు కామి రిటా( చరిత్ర సృష్టించాడు. ఎవరెస్టు శిఖరాన్ని అతను 31వ సారి ఎక్కాడు. అత్యధిక సార్లు ఎవరెస్టును అధిరోహించిన రికార్డును నెలకొల్పాడు. గతంలో తన పేరిట ఉన్న రికార్డును తానే బద్దలు కొట్టాడు. ఇవాళ ఉదయం 4 గంటల సమయంలో కామిరిటా.. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్టును ఎక్కాడు.గత రెండేళ్ల నుంచి ట్రెక్కర్ కామి రిటా ప్రతి సీజన్‌లో రెండు సార్లు మౌంట్ ఎవరెస్టును అధిరోహించాడు. ఈసారి భారతీయ సైన్యానికి చెందిన దళాన్ని కామి రిటా తీసుకెళ్లాడు. సెవన్ సమ్మిట్ ట్రెక్స్, 14 పీక్స్ ఎక్స్‌పెడిషన్‌లో సీనియర్ గైడ్‌గా కామి రిటా చేస్తున్నాడు. నేపాల్‌లోని సోలుకుంబ్ సమీపంలోని థామే గ్రామంలో జన్మించాడు. పర్వతారోహణకు అతను జీవితాన్ని అంకితం చేశాడు. 1970, జనవరి 2వ తేదీన అతను పుట్టాడు. చిన్నతనం నుంచి పర్వతాలు ఎక్కాలన్న తపనతో పెరిగాడు. గత రెండు దశాబ్దాల నుంచి కామి రిటా పర్వతాలను అధిరోహిస్తున్నాడు.తొలిసారి 1992లో కామి రిటా మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాడు. ఓ బృందానికి అతను సపోర్ట్ సభ్యుడిగా వెళ్లాడు. అప్పటి నుంచి ధైర్యంగా ఎవరెస్టును ఎక్కే ప్రయత్నం చేశాడు. 1994 నుంచి 2025 వరకు కామి రిటా మౌంట్ ఎవరెస్టును 31 సార్లు ఎక్కినట్లు చాంగ్ దావా తెలిపారు. కే2తో పాటు లోసే పర్వతాలను ఒక్కసారి ఎక్కాడు. మనస్లు మూడు సార్లు, చో యూ 8 సార్లు

# అన్ని జిల్లాల్లో హాల్‌మార్కింగ్ కేంద్రాలు



ఢిల్లీ: దేశంలోని అన్ని జిల్లాల్లో హాల్ మార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. %దీ×ూ% గవర్నింగ్ కౌన్సిల్ కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సమక్షంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెళ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ 2014-15లో భారత్‌లో కేవలం 2,000 స్టాండర్డులు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రస్తుతం (2025 నాటికి) ఈ సంఖ్య 23,000 స్టాండర్డులకు చేరిందని చెప్పారు. ప్రమాణీకరణ సంఖ్యను 55,000 వరకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.భారత్ తయారు చేసిన స్టాండర్డుల్లో 95 శాతం హార్మోనైజ్డ్ (హార్మోనైజ్డ్ కమోడిటీ డిస్క్రిప్షన్ అండ్ కోడింగ్ సిస్టమ్).. అని చెప్పారు. భారత స్టాండర్డ్‌లు ఇప్పుడు ప్రపంచ ప్రామాణికంగా మారుతున్నాయని, హాల్‌మార్కింగ్ విషయంలో అభివృద్ధి సాధించినట్లు వివరించారు. ఇప్పటివరకు 371 జిల్లాల్లో బంగారం హాల్‌మార్కింగ్ అమల్లో ఉందని, దేశవ్యాప్తంగా విస్తరణలో భాగంగా అన్ని జిల్లాలో హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. త్వరలో కేంద్రం బులియన్ హాల్‌మార్కింగ్ ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. వెండి ఆభరణాల కోసం విధాన నిర్ణయం తీసుకున్నామని, త్వరలో వెండి ఆభరణాలపై హాల్‌మార్కింగ్ కోసం విధాన ప్రకటన చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. భారతదేశంలో ప్రమాణాల పరిరక్షణ, నాణ్యత నియంత్రణ, వినియోగదారుల న్యాయహక్కుల పరిరక్షణలో %దీ×ూ% పాత్రను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.



# రెండ్రోజుల లాభాలకు బ్రేక్.. 600 పాయింట్లకు పైగా కోల్పోయిన సెన్సెక్స్



**ముంబై-నవభూమి:** గత రెండు సెషన్లలో భారీగా లాభపడిన దేశీయ సూచీలు కిందకు దిగి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల ప్రభావం రెండ్రోజుల లాభాలకు బ్రేక్ వేసింది. హెవీ వెయిట్ షేర్లలో అమ్మకాలతో పాటు ఆటో, ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల నష్టాలు సూచీలను కిందకు లాగాయి. ప్రస్తుతం వెలువడుతున్న త్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ మంగళవారం నష్టాల బాట పట్టాయి సోమవారం ముగింపు (82, 176)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. ఒక దశలో 1000 పాయింట్లకు పైగా కోల్పోయి 81, 121 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. చివరకు 624 పాయింట్ల నష్టంతో 81, 551 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 174 పాయింట్ల నష్టంతో 24, 826 వద్ద రోజును ముగించింది. మళ్లీ 25 వేల మార్క్ దిగువకు పడిపోయింది. సెన్సెక్స్‌లో సుప్రీమ్ ఇండస్ట్రీస్, కంటైనర్ కార్పొరేషన్, జియో ఫైనాన్షియల్స్, టిటాగర్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అల్ట్రాటెక్, ఐటీసీ, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బీఎస్ఈ లిమిటెడ్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 87 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 219 పాయింట్లు కోల్పోయింది.

## ఏఐ ఎఫెక్ట్.. ఐబీఎమ్‌లో 8 వేల మంది తొలగింపు.. హెచ్ఆర్‌లో అధిక కోతలు



**ముంబై-నవభూమి:** ప్రముఖ టెక్ సంస్థ ఐబీఎమ్‌లో ఏకంగా 8 వేల మందిని తొలగించినట్టు తెలుస్తోంది. సంస్థ హెచ్ఆర్ విభాగంలో అధికశాతం లేఆఫ్స్ చోటుచేసుకున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. 200 మంది హెచ్ఆర్ ఉద్యోగుల స్థానంలో ఏఐ ఏజెంట్లను (కృత్రిమే మేధ ఆధారిత సాఫ్ట్‌వేర్లు) నియమించినట్టు సంస్థ ప్రకటించిన కొన్ని రోజులకే లేఆఫ్స్ వార్తలు వైరల్ కావడం కలకలం రేపుతోంది (%×దీవీ యశీఎ ఏబ్ం). %ఐబీఎమ్‌లో హెచ్ఆర్ సమాచారాన్ని క్రోడీకరించడం, ఉద్యోగుల ఈమెయిల్స్‌కు ప్రత్యుత్తరాలివ్వడం, పేపర్‌వర్క్‌ను ప్రాసెస్ చేయడం వంటి సాధారణ పనులు ఏఐ ఏజెంట్లకు అప్పగించినట్టు తెలుస్తోంది. మనుషుల జోక్యం అంతగా అవసరం లేని రిపిటీటివ్ పనులను ఏఐకి అప్పగిస్తున్నట్టు సమాచారం. అయితే, సంస్థ ఏఐ వైపు అధికంగా మళ్లుతుండటంతో వేలల్లో ఉద్యోగాలు పోతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏఐ వినియోగంపై ఇటీవలే ఐబీఎమ్ సీఈఓ అరవింద్ కృష్ణ స్పందించారు. సంస్థలో కార్యకలాపాలు మరింత సరళతరం చేసేందుకు ఏఐ, ఆటోమేషన్ వినియోగాన్ని పెంచుతున్నట్టు చెప్పారు. తద్వారా వివిధ టీమ్స్ ఉత్పాదకత మరింత పెరిగిందని చెప్పారు. ఇలా పొదుపు చేసిన సొమ్మును పెట్టుబడులు అధికంగా అవసరం ఉన్న సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్, సేల్స్ విభాగాల్లోకి మళ్లిస్తున్నట్టు తెలిపారు. ఏఐ వినియోగం తరువాత సంస్థలో ఉద్యోగుల సంఖ్య పెరిగిందని కూడా అన్నారు. ఉద్యోగుల సంఖ్యను కుదించేందుకు తాము ప్రయత్నించట్లేదని ఐబీఎమ్ చెబుతోంది. సృజనాత్మకత, వ్యూహాత్మక ఆలోచన ధోరణి, పీపుల్స్ స్కిల్స్ అవసరమైన సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్, మార్కెటింగ్ విభాగాలపై దృష్టి పెడుతున్నట్టు చెప్పింది. .ఏఐతో ఉద్యోగాలన్నిటికీ ముప్పు ఉన్నట్టు భావించరాదని ఐబీఎమ్ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ నికల్ లామొరో తెలిపారు. కొన్ని బాధ్యతలను మాత్రమే పూర్తిగా ఏఐకి అప్పగించడం సాధ్యమవుతుందని అన్నారు. రిపిటీటివ్ బాధ్యతలను ఏఐ చక్కబెడుతుందని వివరించారు. ఇదిలా ఉంటే ఐబీఎమ్‌తో సహా అనేక సంస్థలు ఏఐ బాట పడుతున్నాయి. కొత్త ఉద్యోగిని తీసుకునే ముందు అతడి బాధ్యతలు ఏఐ ఎందుకు చేయలేదో ఒకసారి ప్రశ్నించుకున్నాకే ముందడుగు వేయాలని షాపిఫై సంస్థ సీఈఓ ఉద్యోగులకు అంతర్గతంగా జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు.

## పసిడి ప్రియులకు అలర్ట్.. తగ్గిన బంగారం, పెరిగిన వెండి



**ముంబై-నవభూమి:** దేశంలో బంగారం వెండి ధరలు మార్కెట్‌లో ఎప్పటికప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 24 క్యారెట్ పసిడి ధర సగటున 95 వేల స్థాయి నుంచి తగ్గడం లేదు. ఈ క్రమంలోనే మే 27, 2025న ఉదయం నాటికి బంగారం రేటు స్వల్పంగా తగ్గగా, వెండి ధరలు మాత్రం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలోనే గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఈరోజు ఉదయం 6.30 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 400 తగ్గిపోయి రూ. 97,630కి చేరింది. 22 క్యారెట్ పసిడి ధర కూడా 10 గ్రాములకు రూ. 400 తగ్గి రూ. 89,500కి చేరుకుంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాముల రూ. 97,780 స్థాయికి చేరగా, 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 89,640గా ఉంది.

**ఈ బంగారం ధరల్లో కూడా..**

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో కూడా బంగారం ధరలు రూ. 700 తగ్గి 10 గ్రాములకు రూ. 95,650 వద్ద స్థిరపడ్డాయి. జూన్ 2025 గడువుతో ఉన్న %వీజశ% బంగారం ధర రూ. 486 తగ్గి రూ. 95,935కి చేరింది. ఇది 0.5% పతనాన్ని సూచిస్తుంది. ఈ క్రమంలో వ్యాపారంలో బంగారం ధర రూ. 95,507 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఈ తగ్గుదలకు కారణం కామెక్స్ బంగారం ధరల్లో బలహీనత, రూపాయి విలువలో అస్థిరత అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు.

వెండి ధరల్లో పెరుగుదల

బంగారం ధరలు తగ్గినప్పటికీ, వెండి ధరలు మాత్రం స్వల్పంగా పెరగడం విశేషం. ఈ క్రమంలో ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 100 పెరిగి రూ. 1,00,100 మార్కును తాకింది. ఇక హైదరాబాద్, వరంగల్, తిరుపతి, విజయవాడలో కిలో వెండి ధర రూ. 100 పెరిగి రూ.111,100 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో చెన్నై, కేరళ, భువనేశ్వర్, త్రివేండ్రం ప్రాంతాల్లో వెండి ధరలు రూ.111,100గా ఉన్నాయి. వారణాసి, గోవా, నోయిడా, రాజ్ కోట్, మైసూర్, సూరత్, ముంబై, పాట్నా ప్రాంతాల్లో కేజీ వెండి రేట్లు రూ. 100100గా కలవు. వెండి ధరలు రూ. 42 లేదా 0.04% పెరిగి కిలోకు రూ. 98,045 వద్ద ముగిశాయి.


**ధరల పతనానికి కారణాలు**

బంగారం ధరల తగ్గుదలకు అంతర్జాతీయ మార్కెట్‌లోని కొన్ని అనేక అంశాలు కారణమయ్యాయి. అమెరికా యూరోపియన్ యూనియన్ వస్తువులపై సుంకాల అమలును జూన్ 1 నుంచి జులై 6 వరకు వాయిదా వేయడంతో ఆయా దేశాల్లో ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గాయి. దీంతో బంగారంపై ఆకర్షణ క్రమంగా తగ్గిపోయింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆపిల్ ఇంక్‌కు ఐఫోన్‌లను అమెరికాలో తయారు చేయకపోతే 25% సుంకాలు విధిస్తామని హెచ్చరించడం కూడా మార్కెట్‌లో అనిశ్చితిని పెంచింది. గత వారం బంగారం ధరలు దాదాపు 5% పెరిగాయి. ఇది సుంకాల అనిశ్చితి, అమెరికా ఆందోళనల వల్ల సంభవించింది.

## మార్కెట్లకు తొలకరి పులకరింత

**ముంబై-నవభూమి:** రుతుపవనాలు అంచనాల కన్నా ముందుగా ప్రవేశించిన ఉత్సాహంలో స్టాక్ మార్కెట్ సూచీలు వారం రోజుల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయాయి. కేంద్రానికి ఆర్‌బీఐ రూ. 2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్ పంచడం, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని నీతి ఆయోగ్ ప్రకటించడం, ఈయూపై 50 శాతం సుంకాల అమలును ట్రంప్ జూలై 9కి వాయిదా వేయడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. మదుపరులు ఆటో, ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సెన్సెక్స్ 455.37 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద ముగిసింది. ఒకదశలో సూచీ 771 పాయింట్లకు పైగా ఎగిసి 82,492 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ

# టాటా స్కీమ్ అద్భుతం



**ముంబై-నవభూమి:** నెలకు రూ. 1,000 అంటే ఎంత? ఒక మంచి రెస్టారెంట్‌లో ఫ్యామిలీతో ఒక పూట భోజనం లేదా కొన్ని రోజులకు సరిపడా చిన్నపాటి ఖర్చు. కానీ, ఇదే చిన్న మొత్తాన్ని క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే.. 30 ఏళ్లలో ఏకంగా రూ. 1 కోటి కంటే ఎక్కువ సంపదను సృష్టించవచ్చని మీకు తెలుసా? ఇది కల కాదు, నిజం. దేశంలోనే అగ్రగామి మ్యూచువల్ ఫండ్ సంస్థలలో ఒకటైన టాటా మ్యూచువల్ ఫండ్ నుంచి వచ్చిన ఒక అద్భుతమైన ఫండ్, టాటా మిడ్‌క్యాప్ గ్రోత్ ఫండ్.. ఈ అద్భుతాన్ని చేసి చూపింది. మరి మీ డబ్బును కూడా ఇలాగే అసాధారణంగా పెంచుకోవాలంటే ఈ ఫండ్ గురించి పూర్తిగా తెలుసుకోండి. జులై 1, 1994న ప్రారంభమైన టాటా మిడ్‌క్యాప్ గ్రోత్ ఫండ్ %-% రెగ్యులర్ ప్లాన్, ఇది ముఖ్యంగా మిడ్-క్యాప్ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెడుతుంది. ఈ ఫండ్ దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులను అందించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. దీని పెట్టుబడులలో 91.36 శాతం దేశీయ ఈక్విటీలలో ఉండగా, ఇందులో 14.43 శాతం పెద్ద కంపెనీలలో (లార్జ్-క్యాప్), 46.52 శాతం మధ్యస్థాయి కంపెనీలలో (మిడ్‌క్యాప్), 14.58 శాతం చిన్న కంపెనీలలో (స్మాల్-క్యాప్) ఉన్నాయి.

నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 %=×% ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంది. ప్రారంభం నుంచి అంటే 1994 జులై నుంచి ఇప్పటి వరకు సగటున 13.23 శాతం వార్షిక రాబడిని అందించింది. ప్రస్తుతం, ఈ ఫండ్ నికర ఆస్తుల విలువ రూ. 4,505 కోట్లకుపైగా ఉంది.

రూ. 1000 సిప్‌తో రూ. 1.02 కోట్లు..

10 సంవత్సరాల SIP రాబడి: వార్షికంగా 17.99 శాతం

20 సంవత్సరాల SIP రాబడి: వార్షికంగా 16.9 శాతం


30 సంవత్సరాల SIP రాబడి: వార్షికంగా 17.92 శాతం

ఈ అసాధారణ రాబడి రేటుతో, మీరు ప్రారంభం నుంచి నెలకు కేవలం రూ. 1,000 చొప్పున 30 సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టినట్లయితే, మీ మొత్తం పెట్టుబడి రూ. 3.6 లక్షలు కాగా, దాని విలువ ఏకంగా రూ. 1.02 కోట్లుగా వృద్ధి చెంది ఉండేది! ఒకవేళ మీరు లంప్‌సమ్ (ఒకేసారి) పెట్టుబడిని నమ్ముతారా? ఈ ఫండ్‌లో 30 సంవత్సరాల క్రితం రూ. 1 లక్ష ఒకేసారి పెట్టుబడి పెట్టినట్లయితే, ఇప్పుడు దాని విలువ ఏకంగా రూ. 41.58 లక్షలకు చేరేది. అంటే రూ. 1 లక్ష పెట్టుబడి మీకు రూ. 40.58 లక్షల లాభాన్ని తెచ్చిపెట్టింది. ఇది కాలక్రమేణా పెట్టుబడికి ఉన్న శక్తిని, ముఖ్యంగా మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో నిరూపిస్తుంది.

కనీసం 3-4 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్న, అధిక రాబడులను ఆశించే పెట్టుబడిదారులకు ఈ ఫండ్ అనుకూలంగా ఉంటుంది.

గమనిక: ఏ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టినా, గత పనితీరు భవిష్యత్తులో కూడా ఇదే విధమైన రాబడులకు హామీ ఇవ్వదు అని గుర్తుంచుకోండి. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటాయి. కాబట్టి, ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, మీ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ భరించే సామర్థ్యం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని, SEBI-రిజిస్టర్డ్ ఆర్థిక సలహాదారుని సంప్రదించడం తప్పనిసరి.

## ఐటీఆర్ ఫైలింగ్.. ఈసారి కొత్తగా ఏముంది?



ఆర్థిక సంవత్సరం 2024-25కి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్ ఫారమ్‌లను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఈ మార్పులు ప్రధానంగా 2025 బడ్జెట్‌లో ప్రకటించిన సంస్కరణలను అమలు చేయడానికి, అలాగే ఆటోమేటిక్ రిటర్న్ ప్రాసెసింగ్‌కు ఉద్దేశించినవి. ఈ కొత్త అప్‌డేట్‌ల గురించి తెలుసుకోవడం వల్ల మీరు మీ రిటర్న్‌ను తప్పులు లేకుండా సమర్పించవచ్చు, చివరి నిమిషంలో వచ్చే ఇబ్బందులను నివారించవచ్చు. మీరు లిస్టెడ్ సెక్యూరిటీల నుంచి రూ. 1,25,000 వరకు మినహాయింపు పరిమితిలో దీర్ఘకాలిక మూలధన లాభాలు పొందినట్లయితే, మీరు ఇప్పుడు ITR-1 ఫారమ్‌ను ఉపయోగించవచ్చు. అయితే, ITR-11కి సంబంధించిన ఇతర అర్హత ప్రమాణాలు మీకు వర్తించాలి. ఒకవేళ మీకు ఏదైనా స్వల్పకాలిక మూలధన లాభాలు లేదా మూలధన నష్టాలు ఉంటే, మీరు ఇతర ఫారమ్‌లను ఉపయోగించాల్సి ఉంటుంది. 2024 బడ్జెట్‌లో ప్రకటించిన మూలధన లాభాల పన్ను రేట్లలో మార్పుల కారణంగా, క్యాపిటల్ గెయిన్స్ షెడ్యూల్‌ను సవరించారు. దీని ప్రకారం, జులై 23, 2024కి ముందు, ఆ తర్వాత వచ్చిన లాభాలను వేర్వేరుగా చూపాలి, తద్వారా సరైన పన్ను రేట్లను వర్తింపజేయవచ్చు. ఈ వివరాలను మీ బ్రోకర్ లేదా మ్యూచువల్ ఫండ్ అందించగలరు కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

షేర్ల బైబ్యాక్‌పై పన్ను..

అక్టోబర్ 1, 2024 నుంచి.. షేర్ల బైబ్యాక్‌పై పన్ను చెల్లించే బాధ్యత కంపెనీల నుంచి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు మారింది. బైబ్యాక్ మొత్తం డివిడెండ్‌గా పరిగణిస్తారు. ఇంకా దీనిపై పన్ను పడుతుంది.

మీరు వ్యాపారం నుంచి ఆదాయాన్ని చూయిస్తున్నట్లయితే.. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ కు చెల్లింపులు ఎన్ని రోజుల్లో చేశారో ఇప్పుడు తప్పనిసరిగా వెల్లడించాలి. 45 రోజులకు మించి చేసిన ఏ చెల్లింపునైనా వ్యాపార ఖర్చుగా అనుమతించబడదు.

(ఆస్తులు, అప్పులు) షెడ్యూల్ కింద ఆస్తులు, అప్పులను నివేదించడానికి ఉన్న పరిమితిని రూ. 50 లక్షల నుండి రూ. 1 కోటికి పెంచారు. ఇది పన్ను చెల్లింపుదారులకు కొంత వెసులుబాటు కల్పించినప్పటికీ, మీ ఆస్తులు, అప్పులు, సంవత్సరం పొడవునా జరిగిన అన్ని రికార్డులను సరిగ్గా నిర్వహించడం చాలా ముఖ్యం.

ముఖ్యమైన విషయాలు..

మీకు పన్ను పరిధిలోకి రాని ఆదాయం లేకపోయినా, కొన్ని పరిస్థితులలో మీరు ఇప్పటికీ రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు, మీరు..విదేశీ పర్యటనల కోసం రూ. 2,00,000 కంటే ఎక్కువ ఖర్చు చేస్తే.. సంవత్సరంలో విద్యుత్ బిల్లులకు రూ. 1,00,000 కంటే ఎక్కువ చెల్లిస్తేబీ రూ. 25,000 లేదా అంతకంటే ఎక్కువ (పన్ను తీసివేత) లేదా (పన్ను వసూలు) కలిగి ఉంటే (సీనియర్ సిటిజన్లకు రూ. 50,000)

పన్ను నోటీసులు..

పన్ను శాఖ నుంచి నోటీసులు రాకుండా ఉండాలంటే, ఈ క్రింది వాటిని తప్పకుండా పాటించండి.

మీ రిటర్న్‌ను తప్పులు లేకుండా దాఖలు చేయండి.

అన్ని రిపోర్టింగ్ షెడ్యూల్‌లను జాగ్రత్తగా పూర్తి చేయండి.

మీ ఆర్థిక లావాదేవీలు, %ఙఊ, ంఙూ% వివరాల్ని పోర్టల్‌లో అందుబాటులో ఉన్న %ూ×ూ/ు×ూ% నివేదికతో సరిపోల్చండి. అత్యాధునిక డేటా-మ్యాచ్టింగ్, ఆటోమేషన్ కారణంగా, తేడాలు సులభంగా తెలుస్తాయి. మీరు వాటికి సమాధానం కూడా ఇవ్వాల్సి రావొచ్చు.

ఫారమ్ 26 లోని ఆదాయం, పన్ను వివరాలపై మాత్రమే ఆధారపడకుండా, ఫారమ్ 16, ఫారమ్ 16%ూ% వంటివి కూడా సేకరించడం మంచిది. ఈ ఫారమ్‌లు సాధారణంగా జూన్ 15 నాటికి అందుబాటులో ఉంటాయి. అప్పటి వరకు వేచి ఉండి, మీ రిటర్న్‌ను దాఖలు చేయడం మంచిది. ఒకవేళ మీరు జూన్ 15 లోపు ఫైల్ చేయాలని నిర్ణయించుకుంటే, ఆ తేదీ తర్వాత మీ ఫారమ్ 26%ూ% ను మరోసారి సమీక్షించి, చెల్లింపుదారు నివేదించిన ఆదాయం లేదా పన్ను గణాంకాలలో ఎటువంటి మార్పులు లేవని నిర్ధారించుకోండి. ఈ సంఖ్యలలో ఏవైనా తేడాలు ఉంటే పన్ను అధికారుల నుంచి విచారణ ఎదుర్కోవచ్చు. ఇంకా మళ్లీ మీ పన్ను రిటర్న్‌ను సవరించాల్సి రావచ్చు.

## సిమెంట్ రంగంలో మరిన్ని కొనుగోళ్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ సిమెంట్ పరిశ్రమలో కన్సాలిడేషన్ కొనసాగుతుందని మూడీస్ రేటింగ్స్ ఒక నివేదికలో తెలిపింది. చిన్న కంపెనీలే ఇందుకు లక్ష్యమవుతాయని పేర్కొంది. గత ఐదేళ్లలో టాప్-10 కంపెనీలు రూ.89,000 కోట్ల పెట్టుబడితో 14 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్రాంతీయ చిన్న కంపెనీలను కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. మార్కెట్‌పై పట్టు బిగించేందుకు అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ వంటి పెద్ద కంపెనీలు ఇక ముందు కూడా తక్కువ ఉత్పత్తి సామర్థ్య వినియోగం, అరకొర లాభాలతో పని చేసే చిన్న చిన్న కంపెనీల కొనుగోళ్లు కొనసాగిస్తాయని మూడీస్ రేటింగ్స్ అంచనా. ఒక్క దక్షిణ భారతంలోనే ఇలాంటి చిన్న కంపెనీలు 70 వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. మరింత ఉత్పత్తి సామర్థ్యం : పెరుగుతున్న గృహ నిర్మాణం, ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో 2030 వరకు దేశంలో సిమెంట్ గిరాకీ ఏటా ఆరు నుంచి ఏడు శాతం వరకు పెరుగుతుందని అంచనా వేసింది. డిమాండ్‌ను తట్టుకునేందుకు కంపెనీలు వచ్చే ఐదేళ్లలో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 30 శాతం (20 కోట్ల టన్నులు) పెంచాల్సి ఉంటుందని మూడీస్ స్పష్టం చేసింది. ఇందులో 17 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం 2028 మార్చి నాటికి అందుబాటులోకి రానుంది. 2030 నాటికి ఏర్పడే 20 కోట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యంలో 30 శాతం (ఆరు కోట్ల టన్నులు) అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ కంపెనీల ద్వారానే అందుబాటులోకి రానుంది. మరో 25 శాతం ఉత్పత్తి శ్రీ సిమెంట్, దాల్మియా భారత్ కంపెనీల ద్వారా అందుబాటులోకి వస్తుందని అంచనా. ధరలు మరింత పైకి : మరోవైపు సిమెంట్ కంపెనీలు ధరల పెంపు ప్రారంభించాయి. వారం పది రోజుల క్రితం వరకు తెలుగు రాష్ట్రాల్లో 50 కిలోల సిమెంట్ బస్తా ధర కంపెనీని బట్టి రూ.310 నుంచి రూ.350 వరకు ఉండేది. ఇపుడది రూ.360 నుంచి రూ.400 పలుకుతోంది. గత రెండు నెలల్లో కంపెనీలు ధరలు పెంచడం ఇది రెండో సారి. ధరలు పెంచడంతో అమ్మకాలు మరింత తగ్గాయని రిటైల్ డీలర్లు చెబుతున్నారు. బస్తాసిమెంట్ ధర కనీసం రూ.400 ఉంటే తప్ప గిట్టుబాటు కాదని కంపెనీలు చెబుతున్నాయి.

## ఏఐ నిపుణులకు గుడ్‌న్యూస్!




: దేశంలోని అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ, టాటా గ్రూప్‌లోని దిగ్గజ సంస్థ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ.క్లౌడ్ వ్యాపారాన్ని రెండుగా విభజించింది. దీనిద్వారా ఇప్పటి వరకు అవకాశాలు అందుకోలేకపోయిన మార్కెట్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు టీసీఎస్‌లోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఒక విభాగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవకాశాలపై మరో విభాగం క్లౌడ్‌పై పని చేస్తుందని వివరించారు.

ఏఐ.క్లౌడ్ బిజినెస్‌ను రెండేళ్ల కిందట ప్రారంభించారు. టీసీఎస్ సగటు కంటే అధిక వృద్ధిని సాధించింది. కొత్తగా ఏర్పాటైన ఏఐ డేటా విభాగానికి ప్రస్తుతం ఏఐ.క్లౌడ్ విభాగం అధిపతి అయిన శివ గణేశన్ నేతృత్వం వహించనున్నారని టీసీఎస్ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. ఇక ఏఐ. క్లౌడ్ డిప్యూటీ హెడ్‌గా వ్యవహరించిన కృష్ణ మోహన్ క్లౌడ్ విభాగాన్ని నడిపించనున్నట్లు కంపెనీ అధికారి తెలిపారు. అశోక్ కృష్ ఏఐ గ్లోబల్ హెడ్‌గా ఉంటారని, అలాగే సతీశ్ బైరావన్ డేటా యూనిట్ గ్లోబల్ హెడ్‌గ్గె ఉంటారని కంపెనీ పేర్కొంది. ఏఐ నిపుణుల నియామకం..

ఏఐ వ్యాపారంపై ప్రత్యేక దృష్టి సారించింది టీసీఎస్. ఈ క్రమంలోనే ఏఐ.క్లౌడ్‌ను రెండుగా విభజిస్తున్నట్లు తెలుస్తోంది. రెండుగా మారుస్తున్న క్రమంలో మార్కెట్ నుంచి నైపుణ్యం కలిగిన ఏఐ ప్రతిభ గల వారిని నియమించుకుంటున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. అలాగే శిక్షణా పాఠ్యాంశాలను పునరుద్ధరిస్తున్నామని, దీని ద్వారా కంపెనీలని ప్రస్తుత ఉద్యోగులకు సైతం శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నాయి.


టర్మ్ ఇన్సూరెన్స్ - ఉచిత కోట్ పొందండిఏఐ, క్లౌడ్ రెండింటికీ గణనీయమైన వృద్ధి సామర్థ్యం, విస్తృతంగా ఉపయోగించబడిన మార్కెట్ ఉందని కంపెనీ భావిస్తోందని, అంకితమైన వ్యాపార యూనిట్లు ఉండటానికి ఇదే కారణమని అధికారులు తెలిపారు. డేటా, ఏఐ రెండూ దగ్గరి సంబంధం కలిగి ఉన్న క్రమంలో ఏఐ వ్యాపార విభాగంలో భాగంగా చేయబడుతున్నాయని ఒక అధికారి తెలిపారు. అనేక సందర్భాల్లో సంస్థల డేటా ల్యాండ్ స్కేప్ ఏఐతో వ్యవహించడానికి సిద్ధంగా లేనప్పుడు, టీసీఎస్ దాని సేవలను మిశ్ర ప్రతిపాదనగా అందించగలదని వివరించారు.

## టీసీఎస్ ఏఐ.క్లౌడ్ వ్యాపార విభజన




**ముంబై-నవభూమి:** ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస (టీసీఎస్) ఏఐ.క్లౌడ్ వ్యాపారాన్ని రెండుగా విభజించింది. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ వ్యాపారాల్లో మరింత అధిక వృద్ధి లక్ష్యంగా కంపెనీ ఈ పునర్‌వ్యవస్థీకరణ చేపట్టినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. టీసీఎస్ 2023 ఆగస్టులో ఏఐ.క్లౌడ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఏఐ.క్లౌడ్‌కు ఉప అధిపతిగా ఉన్న కృష్ణ మోహన్ ఇకపై క్లౌడ్ విభాగానికి సారథ్యం వహించనున్నారు. ఆశోక్ క్రిష్ ఏఐ గ్లోబల్ హెడ్‌గా వ్యవహరించనున్నారు. కాగా, సతీష్ భైరవన్ డేటా విభాగ గ్లోబల్ హెడ్‌గా సేవలందించనున్నారు.

# ట్రంప్ మరో ప్రకటన.. ఒక్కసారిగా తగ్గిన బంగారం ధర



**ముంబై-నవభూమి:** భారతీయులకు బంగారం అంటే ఎంతో ఇష్టం. ముఖ్యంగా భారతీయ మహిళలు బంగారాన్ని ఇష్టపడుతుంటారు. అలాగే పండగలు, శుభకార్యాలు, వేడుకల సమయాల్లో బంగారు ఆభరణాలు కొంటుంటారు. అయితే, ఈ ఏడాదిలో ఇప్పటికే బంగారం ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు అంటూ వాణిజ్య యుద్ధాలకు దారితీసిన క్రమంలో బంగారం ధరలు భారీగా పెరిగాయి. అయితే సుంకాల పెంపును వాయిదా వేయడం, చైనాతో అమెరికాతో డీల్ చేసుకోవడం వంటి పరిణామాలతో పసిడి రేట్లు మళ్లీ దిగివస్తున్నాయి. మధ్యలో మళ్లీ పెరిగాయి. అయితే, ట్రంప్ తీసుకున్న మరో కీలక నిర్ణయం పసిడి ప్రియులకు శుభవార్త అందించింది. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధరలు గణనీయంగా దిగివచ్చాయి. ఆ ప్రభావం దేశీయంగానూ కనిపించింది. యూరోపియన్ యూనియన్ వస్తువులపై వచ్చే జూన్ 1వ తేదీ నుంచి 50 శాతం సుంకాలు విధిస్తామని బెదిరిస్తూ వస్తున్నారు. అయితే, తాజాగా ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. వాషింగ్టన్- యూరోపియన్ యూనియన్ మధ్య ఓ ఒప్పందం కుదుర్చుకునేందుకు జులై 9వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఈ ఒక్క ప్రకటనతో సోమవారం సెషన్‌లో పసిడి ధరలు ఒక శాతం మేర పడిపోయాయి. ప్రస్తుతం స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 0.8 శాతం మేర దిగివచ్చి ప్రస్తుతం 3,342 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 33.45 డాలర్ల వద్ద ఉంది. మరోవైపు.. ఇండియన్ కరెన్సీ రూపాయి విలువ రూ.85.155 వద్ద అమ్ముడవుతోంది.

**హైదరాబాద్‌లో తగ్గిన బంగారం ధర**

హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు ఒక్కసారిగా దిగివచ్చాయి. ఇవాళ 24 క్యారెట్ల మేలిమి గోల్డ్ రేటు 10 గ్రాములపై రూ. 440 మేర దిగివచ్చింది. దీంతో తులం రేటు రూ. 97 వేల 640 వద్దకు తగ్గింది. అలాగే 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు ఇవాళ తులంపై రూ.400 దిగివచ్చింది. దీంతో 10 గ్రాముల పసిడి రేటు రూ. 89 వేల 500 వద్దకు పడిపోయింది.

**మళ్లీ పెరిగిన వెండి ధర**

హైదరాబాద్ మార్కెట్లో పసిడి ధరలు దిగివచ్చి ఊరట కల్పించగా వెండి మాత్రం షాకిచ్చింది. వరుసగా తగ్గుతూ వచ్చిన వెండి ఇవాళ పెరిగింది. కిలో వెండి రేటు హైదరాబాద్‌లో రూ.1000 మేర పెరిగింది. దీంతో కేజీ సిల్వర్ ధర రూ. 1,11,000 స్థాయికి ఎగబాకింది. పైన పేర్కొన్న బంగారం, వెండి ధరలు మే 27వ తేదీ మంగళవారం రోజు ఉదంయ 7 గంటల సమయంలో ఉన్నవి. మధ్యాహ్నానికి పసిడి ధరలు మారే అవకాశం ఉంది. అలాగే పన్నులు కలిపి లెక్కిస్తే ప్రాంతాల వారీగా ధరలు వేరు వేరుగా ఉంటాయి.

